Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 275 | హైదరాబాద్ | బుధవారం 19 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# వాట్ నెక్ట్స్.. తెలంగాణ!



## ఆశలు వదులుకున్న బీజేపీ

## జాతీయ కార్యవర్గం దక్కని చోటు

- ఉన్న పదవులకూ మంగళం
- డీకే అరుణ, లక్ష్మణ్‌లకు దక్కని ఊరట
- కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారా?
- అరుణకు అవకాశం వచ్చేనా?
- మారుతున్న సమీకరణలు

**అస్సోం ఎన్నికల్లో విజయం తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ట్వీట్ నెక్ట్స్ టార్గెట్ తెలంగాణ అని.. కానీ, కాషాయం పెద్దలు తెలంగాణపై ఆశలు వదులుకున్నారా? ఇక్కడ ఎన్ని ఎత్తులు వేసినా బీజేపీ బలం పెరిగే అవకాశం లేదా? నేతల మధ్య సమన్వయం కుదరనంత వరకు తెలంగాణలో పాగా వేయలేమని.. ఎంత చేసినా ఇక్కడి నేతలు కలిసి పని చేయడం లేదా అంటే పరిస్థితులు అవుననే అనిపిస్తున్నాయి. బీజేపీ జాతీయ ఆఫీస్ బేరర్ల ఎంపిక ఈ ప్రశ్నలకు, అనుమానాలకు తావిస్తోంది.**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

బీజేపీ తెలంగాణపై ఆశలు వదులుకుందని, అందుకే జాతీయ స్థాయిలో తెలంగాణకు ప్రాధాన్యం తగ్గించిందన్న చర్చ జరుగుతోంది. గత కమిటీలో జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను ఆ పదవి నుంచి తప్పించింది. అలాగే, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేత లక్ష్మణ్‌కు అవకాశం దక్కలేదు. ఇక పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు లేదా మోర్చాల అధ్యక్షుల విభాగాల్లో రాష్ట్రం నుంచి ఏ ఒక్క నేతకూ స్థానం దక్కకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవితో పాటు అనుబంధ సెల్స్ సమన్వయకర్తగా కీలక బాధ్యతలు ఇచ్చిన హైకమాండ్, తెలంగాణను పూర్తిగా పక్కన పెట్టడం వెనుక బలమైన రాజకీయ సంకేతాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### మరో మంత్రికి ఛాన్స్ ఇస్తారా?

పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఇప్పటి వరకు ఉన్న డీకే అరుణ కొత్త కార్యవర్గంతో ఆమె మాజీగా మారారు. లోక్‌సభ సభ్యురాలైన ఆమెను ఈ బాధ్యత నుంచి తప్పించారు. అయితే, త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ఆమెకు ఛాన్స్ ఇస్తారని చెబుతున్నారు. తెలంగాణ నుంచి ఇప్పటికే బండి సంజయ్, జి. కిషన్‌రెడ్డిలు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఈ క్రమంలో తెలంగాణకు అదనపు బెర్త్ దక్కుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న ఆమెకు కేంద్ర మంత్రిపదవి ఇవ్వాల్సి వస్తే.. సమాజిక సమీకరణలు.. బీసీ ఓటు బ్యాంకు తదితర విషయాలు తెరపైకి వస్తాయి. దీంతో డీకే అరుణ వెనుకబడి.. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు తెరపైకి వచ్చే అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. మరి పార్టీ అధిష్ఠానం మదిలో ఏముందో తెలియాలంటే వేచి చూడక తప్పని పరిస్థితి.

### నేతల మధ్య వర్గ పోరాటం..

తెలంగాణ బీజేపీ నేతల మధ్య వర్గపోరాటం వల్లే పార్టీ అధిష్ఠానం ఈ దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్

- మిగతా 2వ పేజీలో



# పోలీస్ చర్యపై దర్యాప్తుకు హైపవర్ కమిటీ

## చలో సంసద్ ర్యాలీలో హింసాత్మక ఘటనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- సుప్రీం, హైకోర్టుల మాజీ జడ్జీలు, మాజీ డీజీపీ, మాజీ సీబీఐ డైరెక్టర్‌లతో కమిటీ
- మహిళా ఉద్యమకారులపై లైంగిక వేధింపులకు గురైన అంశం సైతం పరిశీలన

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ప్రజాతీర్పు)

ప్రతిష్ఠాత్మక నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతంలో పార్లమెంట్ ఎదుట నిరసన వ్యక్తం చేసేందుకు చలో సంసద్ ర్యాలీగా దూసు కొచ్చిన విద్యార్థులను పోలీసులు బాష్పవాయుగోళాలతో అడ్డుకుని లాఠీచార్జ్ చేసి విచక్షణారహితంగా చితకబాదారన్న ఆరోపణలపై సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. పార్లమెంట్ సాక్షిగా ఉద్యమకారులపై ఢిల్లీ పోలీసుల

- మిగతా 2వ పేజీలో



# హర్మూజ్ అమెరికాలో భాగం

## ఫొటో షేర్ చేసిన ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 18

హర్మూజ్ జలసంధిపై పూర్తిగా నియంత్రణ తమకే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా 'ట్రూత్ సోషల్' వేదికగా కీలక పోస్టు పెట్టారు. 'హర్మూజ్.. అమెరికా కొత్త ప్రదేశం' అని ఆ జలసంధి మ్యాప్‌పై రాసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. ప్రస్తుతం హర్మూజ్‌ను దిగ్బంధనం చేసిన అమెరికా.. ఇరాన్ నౌకలను అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపులేవీ జరగడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

2



# దీక్ష విరమించా నిరసన కాదు

## అవినీతిరహిత నియామక విధానం కోసం సరికొత్త ఉద్యమం చేస్తాం

### జార్ఖండ్‌లో నిరాహార దీక్ష విరమణ వేళ దేవేంద్ర మహతో ప్రకటన

రాంచీ, ఆగస్టు 18

రాంచీలోని జైపాల్‌సింగ్ ముండా స్టేడియం వేదికగా దావానలంలా వ్యాపించిన విద్యార్థి ఉద్యమ సెగ తగిలి హేమంత్ సోరెన్ సర్కార్ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించినా తమ నిరసన కొనసాగుతుందని ఉద్యమనాయకుడు, 16 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న దేవేంద్రనాథ్

- మిగతా 2వ పేజీలో

# పాపన్న స్ఫూర్తి కొనసాగాలి

## మహారాష్ట్రకు ఛత్రపతి శివాజీ తెలంగాణకు సర్దార్ సర్వాయి పాపన్న

### లండన్ బ్రిటీష్ లైబ్రరీలో పాపన్న గాథ .. గౌడ, నేత కార్మికులకు త్వరలోనే పింఛన్లు

### బీసీల లెక్కలు తేల్చిన ఘనత కాంగ్రెస్‌దే.. ట్యాంక్ బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి



రంగారెడ్డి, ఆగస్టు 18 (ప్రజాతీర్పు)

మహారాష్ట్రకు ఛత్రపతి శివాజీ ఎలానో తెలంగాణకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అలా అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి కొనసాగాలన్నారు. బహుజనుల ఆత్మగౌరవ పోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకుని, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహాన్ని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, బీసీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాటాడుతూ.. అమరవీరుల స్థూపానికి ఉన్నంత ప్రాధాన్యత పాపన్నగౌడ్ విగ్రహానికి లభించాలని, ఈ విగ్రహం నిత్యం ప్రజల్లో స్ఫూర్తిని నింపేలా ఉండాలని సీఎం అన్నారు. ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహానికి విశిష్ట స్థానం కల్పించామని, సందర్శకులు, పర్యాటకులు ఎవరొచ్చినా స్పష్టంగా కనిపించేలా స్థలాన్ని తానే స్వయంగా సూచించానని సీఎం రేవంత్‌రెడ్డి

- మిగతా 2వ పేజీలో



# క్షమాపణ కాదు.. కనీసం ఒప్పుకున్నారా?

## పదేళ్ల ధరణి తప్పిదాలను అంగీకరించే ధైర్యం హరీశ్‌రావుకు ఉందా?

- కాళేశ్వరంలో జరిగిన తప్పుల గురించి ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా?
- ఏలేటి తాటాకు చప్పుళ్లకు నేను భయపడను
- 22ఏపై 15 రోజులపాటు రోజువారీగా ఫిర్యాదులను పరిష్కరిస్తాం: పొంగులేటి



# భూ దందాకు తెరతీస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

## పేదల భూములు లాక్కుంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం: భాజపా నేతలు ఈటల, ఏలేటి

హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాతీర్పు)

రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను కాపాడాల్సింది పోయి భూ దందాకు తెరతీస్తోందని, పేదలు, రైతుల స్థలాలను లాక్కుంటే చూస్తూ ఊరుకోమని, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈటల మాట్లాడుతూ "తెలంగాణ వస్తే భూ సమస్యలన్నీ

- మిగతా 2వ పేజీలో

# రాజీనామా చేయాలి

## నిషేధిత భూముల తప్పిదానికి ఆయనదే నైతిక బాధ్యత

- ప్రజల భూములు జాబితాలో పెట్టింది ఎవరు?
- తప్పు చేసి అధికారులపై నెపం సరికాదు
- 22 ఏ జాబితాను వెంటనే రద్దు చేయాలి
- కబ్జా భూములను క్రమబద్ధీకరిస్తే ఊరుకోం
- మాజీమంత్రి హరీశ్‌రావు మండిపాటు



**నిషేధిత భూముల జాబితా వ్యవహారంలో తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పదవికి రాజీనామా చేయాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజల భూములను 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చి, ఇప్పుడు ఆ తప్పును అధికారులపై నెట్టడం సరికాదన్నారు.**

హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాతీర్పు)

అసలు భూములను జాబితాలో చేర్చింది ఎవరు? ఆదేశించింది ఎవరు? ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. తప్పు జరిగిందని సారీ చెబితే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయా? అని ప్రశ్నించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు 30 శాతం భూమి ఇవ్వాలని, డెవలప్‌మెంట్ హక్కులు కూడా ఇవ్వాలని అడుగుతున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణలో ఇలాంటి దారుణ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల

- మిగతా 2వ పేజీలో

# పాపన్న స్ఫూర్తి కొనసాగాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. దీనికోసం అక్కడ ఉన్న పర్యాటక శాఖ కార్యాలయాన్ని తొలగించి ఖాళీ చేయించామని వెల్లడించారు. మహారాష్ట్రకు ఛత్రపతి శివాజీ ఎలాంటి వారో, తెలంగాణకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అలాంటివారని కొనియాడారు. పాపన్న గాథను లండన్‌లోని బ్రిటీష్ లైబ్రరీలో సైతం భద్రపరిచారని గుర్తుచేశారు. అలాగే బహుజన నాయకుడు పండుగ సాయన్న వీరత్వాన్ని కొనియాడుతూ.. మంత్రి వాకటి శ్రీహరి, ముదిరాజు సంఘం నేతలు తనను కలిసి పండుగ సాయన్న జయంతి, వర్ధంతి గురించి మాట్లాడారని సీఎం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 22న పండు గ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. బహు జన నేతల జయంతులు, వర్ధంతులు అనునిత్యం ప్రజల్లో స్ఫూర్తి నింపేలా కొనసాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ను ఆదేశించారు. దానికి తగ్గట్టు కార్యక్రమాలు చేపట్టాలని ఆయనకు సూచించారు. తమ ప్రభుత్వం సామాజిక న్యా య సూత్రాలకు అనుగుణంగా పనిచేస్తుందని బీసీల సంక్షేమం సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తున్నదని చెప్పుకొచ్చారు. ఈ సందర్భం గా ఉమ్మడి పాలమూరు నేతలు మల్లికార్జున గౌడ్, బాలా గౌడ్ సేవలను గుర్తు చేశారు. మల్లికార్జున్ గౌడ్ కేంద్ర మంత్రిగా అందించిన సేవల ను ఈ తరం నేతలు స్ఫూర్తి పొందాలన్నారు. దేశంలోనే తొలిసారిగా శాస్త్రీయంగా బీసీల సం ఖ్యను లెక్కించి, సామాజిక న్యాయం దిశగా అడుగులు వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన రూ. 8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోస్తూ, వడ్డీలు చెల్లిస్తూనే ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. 2029లోనూ కాంగ్రెసే మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలసి ఎన్నికల బరిలోకి దిగుతామని తెలిపారు. గౌడ, నేత కార్మికుల సం క్షేమానికి ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉం దన్న సీఎం, త్వరలోనే వారిందరికీ పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఖాళీ స్థలాలు, సాగునీటి ప్రాజెక్టులు, కాలువల గట్ల వెంట భారీగా ఈత, తాటి చెట్లను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, దీనివల్ల ప్రజలకు కల్తీ లేని సహజ సిద్ధమైన కల్లు అందుబాటులోకి వస్తుందన్నారు.

సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చేసిన సరదా వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. సీఎం రేవంత్‌రెడ్డికి విస్కీ, స్కాచ్ అలవాటు లేదని, అందుకే ఆరోగ్యానికి ఎంతో మంచిదైన స్వచ్ఛమైన కల్లును తాగి రుచి చూడాలని సరదాగా కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్ మరియు వివిధ ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చేతబడుల దుష్ప్రచారాన్ని ఖండించిన సీఎం

ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. చేతబడులు, క్షుద్ర పూజల పేరిట ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తే సహించేది లేదని, గ్రామీణ ప్రాంతాల్లో చేతబడులు చేస్తే చెట్లకు కట్టేసి కొడతారంటూ హరీష్ రావు వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# పోలీస్ చర్యపై దర్యాప్తుకు హైపవర్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

అతి బలప్రయోగం ఆరోపణల్లో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు అత్యున్నతస్థాయి(హైపవర్) కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం ప్రకటించింది. పోలీసుల అత్యుత్సాహంతో వందలాది మంది గాయాలపాల య్యారని, ఈ ఘటనలో పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పలు పిటిషన్లను సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి మోహనల బెంచ్ విచారించి పై విధంగా ఆదేశాలిచ్చింది. సుప్రీం కోర్టులో, హైకోర్టులో పదవీవిరమణ చేసిన న్యాయ మూర్తులు, మాజీ డీజీపీ, మాజీ సీబీఐ డైరెక్టర్లను సభ్యులుగా ఎంపికచేస్తూ హైపవర్ కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు బెంచ్ తెలిపింది. ర్యాలీలో బాధితులుగా మారిన ఉద్యమకారులు నేరుగా ఈ కమిటీని సంప్రదించి తమ ఫిర్యాదులు, ఆరోపణలు తెలియజేయవచ్చు. కమిటీ ఇచ్చే సిఫార్సులను కోర్టు పరిశీలిస్తుంది. తగు చట్టబద్ధమైన నిర్ణయాలను మేం తీసుకుంటాం"అని ధర్మాసనం తెలిపింది."ఉద్యమిస్తున్న మహిళలతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని, లైంగికంగా వేధించారని వస్తున్న ఆరోపణలపైనా కమిటీ దర్యాప్తు చేయనుంది. ఉద్యమకారిణులను ఆన్‌లైన్‌లో వేధించిన ఉదంతాలు, సోషల్‌మీడియా ద్వారా బెదిరించిన ఘటనలనూ, మహిళా కార్యకర్తలు చేసిన ఫిర్యాదులనూ హైపవర్ కమిటీ పరిశీలిస్తుంది. పరీక్షార్థుల ఉద్యమంతో సంబంధం ఉన్న ప్రతి కోణంలోనూ కమిటీ దర్యాప్తు కొనసాగుతుంది. ఈ ఉదంతంలో నేరస్తులుగా తేలిన వారిపై కఠిన శిక్షలుంటాయి. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వారిని గుర్తించేందుకు జూలై 20వ తేదీనాటి ఘటనాస్థలి ఫొటోలు, వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలను హైపవర్ కమిటీకి ఢిల్లీపోలీసులు అందజేయాలి"అని ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సీజేఐ సూర్యకాంత్ ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులపై మోపిన కేసులను ధర్మాసనం ప్రస్తావించింది. "ఇది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన విషయం. అక్రమ ఎఫ్ఐఆర్‌లను తొలగించాల్సిన సమయమిది. రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రకారం నిరసన తెలిపే హక్కు విద్యార్థులు, పరీక్షార్థులకు ఉంది. అనవసరంగా విద్యార్థులపై మోపిన ఎఫ్ఐఆర్‌లను తొలగించే హక్కు రాజ్యాంగంలోని 142వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టుకు ఉంది"అని ధర్మాసనం గుర్తుచేసింది.

కేసుల మాఫీపై సొలిసిటర్ జనరల్ తుషార్ అభ్యంతరం వ్యక్తంచేశారు. "ఆ రోజు ఆందోళనల్లో 2,800 మంది అసాంఘిక శక్తుల పాత్ర ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వాళ్లకు నేర చరిత్ర ఉంది. జూలై 20న సంసద్ ర్యాలీ ఉద్రిక్తతకు దారితీయానికి వీళ్లే కారణం. వీళ్లను గుర్తించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ, నిఘా సాధనాలను ఉపయోగించాల్సి వచ్చింది"అని తెలిపారు. దీనిపై కోర్టు స్పష్టతనిచ్చింది. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ, నిఘా, ప్రైవసీ అనే అంశాలు ఈ కేసులో ఉల్లంఘనకు గురయ్యాయా లేదా అనేవి కమిటీ నిర్ణయించదు. కోర్టు నిర్ణయిస్తుంది"అని ధర్మాసనం స్పష్టంచేసింది.

విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు అతిగా బలప్రయోగం చేశారన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు. ఈ మేరకు సుప్రీంకోర్టుకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ కౌంటర్ అఫిడవిట్ సమర్పించారు. "ఆరోజు జంతర్‌మంతర్ వద్ద 30,000 మందికిపైగా నిరసనకారులు గుమిగూడారు. సంసద్ ర్యాలీకి అనుమతి లేదు. విద్యార్థులను నియంత్రించేందుకు సుమారు 5 వేల మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారు. బారికేడ్లు తోసేసి పార్లమెంట్ దిశగా దూసుకొస్తున్న నిరసనకారులను నిలువరించగా తోపులాట జరిగింది.

ఈ ఘటనలో 240 మందికిపైగా పోలీసులు గాయపడ్డారు. 200 మంది పౌరులు, నిరసనకారులు సైతం గాయపడ్డారు. ఉద్యమంలో సంఘవిద్రోహ శక్తులు, నేరచరితులు చొరబడ్డారు. వీరిలో 2,873 మందిపై గతంలోనే క్రిమినల్ కేసులు ఉన్నాయి"అని పోలీసులు తెలిపారు. నిరసనల సమయంలో సాధారణ దుస్తుల్లో లాఠీలతో కనిపించిన పోలీసు సిబ్బందికి సంబంధించిన వీడియోలపై కూడా ఢిల్లీ పోలీసులు వివరణ ఇచ్చారు.

ఇలా సాధారణ దుస్తుల్లో పోలీసులను గుంపుల్లో కలిపి విధులు నిర్వహించడం చట్టవిరుద్ధం కాదని, అసాధారణమైన చర్య కూడా కాదని పేర్కొన్నారు. పార్లమెంట్, రాష్ట్రపతిభవన్, సేవా తీర్థ్, కర్తవ్యభవన్, ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర మంత్రుల అధికారిక నివాసాలున్న ఆ ప్రాంతంలో అవాంఛనీయ ఘటన జరక్కుండా తాము సరైన నిర్ణయమే తీసుకున్నట్లు పోలీసులు తమ చర్యను సమర్థించుకున్నారు.

# హార్మూజ్ అమెరికాలో భాగం

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ నౌకల విషయంలో దిగ్బంధనం పూర్తిస్థాయిలో కొనసాగుతోందని తెలిపారు. హార్మూజ్ జలసంధి తెరిచే ఉందని చెప్పారు. సముద్ర జలాల్లో ఇరాన్ అమర్చిన పేలుడు పదార్థాలను తొలగించామని, కొన్నింటిని పేల్చివేశామని 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు. మరోవైపు.. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు హార్మూజ్‌పై పట్టును కొనసాగిస్తామని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ మంగళవారం స్పష్టం చేశారు. "ఒప్పందం ప్రకారం దిగ్బంధనాన్ని ఎత్తేయాలి. స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలి. చమురుపై ఆంక్షలను తొలగించాలి. అదేవిధంగా సైనిక చర్యలకు ముగింపు పలకాలి. అప్పటివరకు హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవబోం" అని స్పష్టం చేశారు.




# రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

జాబితాను వెంటే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మల్కాజ్‌గిరిలో బాధితులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభు త్వం కొత్త ఇబ్బందులను సృష్టిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీలను 22 నిషేధిత జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలి? ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలా? అని నిలదీశారు.

రంగారెడ్డి జిల్లాలో జీఓల ద్వారా మినహాయింపు పొందిన 7,500 ఎకరాల భూములు, మేడ్చల్ జిల్లాలో 6 వేల ఎకరాలకు పైగా భూములు,హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారని హరీశ్ రావు ఆరోపించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలపై పట్టు సాధించేందుకే 22ఏ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నిషేధిత జాబి తాలో భూములు చేర్చినవారే, ఆ భూములను జాబితా నుంచి తొలగించాలని డిమా ండ్ చేశారు.

భూమిని అమ్మడానికి వెళ్లేవరకు అది తమదా, నిషేధిత జాబితాలో ఉం దా అనే విషయం కూడా ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. ఒకటి కాదు, రెండు కాదు.. లక్షలాది స్థలాలు, ఇళ్లను జాబితాలో చేర్చారని వెల్లడించారు. తిలక్‌నగర్‌కు చెందిన అశోక్ ఉదంతాన్ని హరీశ్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అశోక్ తన 450 గజాల ఇంటిని అమ్మాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన తర్వాత అది నిషేధిత జాబితాలో ఉందని తెలిసిందన్నారు. మరుసటి రోజు అమెరికా వెళ్లేందుకు టికెట్లు కూ డా బుక్ చేసుకున్న అశోక్ పరిస్థితి ఇప్పుడు ఏమిటి? అమెరికా వెళ్లాలా? వద్దా? అక్కడ ఉద్యోగం చేయాలా? వద్దా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చి, ఇప్పుడు ఆ తప్పును అధికారులపైకి నెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. తప్పు చేసిది మీరు, ప్రజలు దరఖాస్తు చేసుకోవాలా? అని ప్రశ్ని ంచారు. మంత్రి పొంగులేటి బాధ్యత వహిం చి నిషేధిత జాబితా నుంచి ప్రజల భూములను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. ఇది ఎంత దగా ప్రభుత్వం? అని హరీశ్ విమర్శించారు.

ముఖ్యమంత్రి నివాసం కూడా 22 ఏ పరిధిలో ఉందన్న అంశాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. ఒక వేళ సీఎం ఇంటి పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంటే.. ఆయనకు పొంగులేటి సారీ చెప్పలేదా? అని ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలతో పాటు తొలగించిన భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, దీనిపై ప్రభుత్వం వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితా తొలగింపులో పారదర్శకత ఉండాలని, నిజమైన భూ హక్కుదారుల భూములను మాత్రమే తొలగించాలని స్పష్టం చేశారు. 22ఏ ముసుగులో అక్రమంగా ఆక్రమించిన లేదా వివాదాస్పద భూములను తొలగిస్తే మాత్రం బీఆర్ఎస్ ఊరుకోదు అని హరీశ్‌రావు హెచ్చరించారు. 'సీఎం, మంత్రుల ఆదేశాలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున జాబితాలు మార్చడం సాధ్యమా?. వారు చెప్పినట్లు చేస్తే చివరకు మీరు ఇరుక్కుంటారు. ముక్కుసూటిగా వ్యవహరించండి. తప్పు చేసి బలికావొద్దు' అని అధికారులకు హరీశ్‌రావు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సంబంధిత మంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

మంత్రి చేసిన తప్పులకు సీఎం చర్యలు తీసుకోకపోతే.. ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పుచేసిన కాంగ్రెస్ నాయకులను చట్టపరంగా బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. ఈ అంవంపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణ భవన్‌లోని జనతా గ్యారేజీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరికైనా సమస్య ఉంటే రండి.. మీకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో కూడా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కోర్టులో కౌంటర్ కూడా దాఖలు చేయకుండా కావాలనే నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కోసం రూ. 2,600 కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.800 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు.

కల్యాణలక్ష్మి ఇప్పుడు సంతానలక్ష్మిగా మారిందని, పెళ్లి సమయంలో అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత వస్తోందని ఎద్దేవా చేశారు. కల్యాణలక్ష్మి విషయంలో అధికారుల తప్పిదమని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నారు, ఎక్కడా ఇరుక్కోకుండా ముక్కుసూటిగా వ్యవహరించాలని సూచించారు.

డిమాడ్ల సాధన కోసం సర్వే భవన్ వద్ద శాంతియుత నిరసన చేస్తున్న సర్వేయర్లను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని హరీశ్ రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా 6,500 మంది లైసెన్స్‌డు సర్వేయర్లకు ఏడాది కాలంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. వారు ఎలా జీవించాలి? కుటుంబాలను ఎలా పోషించాలి? అని ప్రశ్నించారు. అరెస్టులతో సర్వేయర్ల గొంతును అణచివేయడం తగదన్నారు. అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని, తక్షణమే చర్చలు జరిపి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# వాట్ నెక్స్ట్.. తెలంగాణ!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్టీకి బలమైన పునాది అందించిన తెలంగాణపై కేంద్ర నాయకత్వం అసంతృప్తిగా ఉండటానికి ప్రధాన కారణం స్థానిక నేతల మధ్య కొనసాగుతున్న వర్గపోరేనని రాజకీయ విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవకాశాలు ఉన్నప్పటికీ.. నేతల మధ్య సమన్వయ లోపం, అంతర్గత కుమ్ములాటలు, ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకునే ధోరణితో క్షేత్రస్థాయిలో పార్టీ గ్రాఫ్ దిగజారుతోందన్న అసహనం అధిష్ఠానంలో నెలకొంది. ఎన్నికల విజయాల తర్వాత మరింత ఐక్యంగా పనిచేయాల్సింది పోయి గ్రూపులుగా విడిపోవడంపై పార్టీ పెద్దలు తీవ్ర అసహనంతో ఉన్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఇటీవలే ఇక్కడి నేతలను ఢిల్లీకి పిలిచి సమన్వయం కుదిర్చేందుకు పార్టీ పెద్దలు ప్రయత్నించారు. నేతలంతా వారి ముందు సరేనంటూ తలూపినా క్షేత్రస్థాయిలో వారు కలిసి పని చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఎనిమిది మంది ఎంపీల మధ్య సమన్వయం లేదు. ఇద్దరు కేంద్ర మంత్రులున్నా వారి మధ్య కూడా సరైన అవగాహన లేదన్న విమర్శ ఉంది. ఈ నేపథ్యంలోనే జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు చోటు దక్కలేదని భావిస్తున్నారు.

# భూ దందాకు తెరతీస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

తీరి పారదర్శక చట్టం వస్తుందని ప్రజలు ఆశించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో పేద రైతుల హక్కులను కాలరాసింది. ధరణి రాకముందు పహాణీలో ఉన్న 13 కాలమ్స్ తొలగించడం వల్ల 50 నుంచి 70 ఏళ్లుగా భూములను సాగుచేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీలు, బీసీ రైతులు నష్టపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భూభారతి పేరుతో పేద రైతులను మరింత అగాధంలోకి నెట్టింది. హైదరాబాద్ పరిసరాల్లో హైడ్రా, పోలీసుల పహారాలో భూములను లాగేసుకుంటున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో వేల ఎకరాల పేదల భూములకు హైడ్రా రాత్రికి రాత్రి ఫెన్సింగ్ వేసింది" అని ఈటల తెలిపారు.

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో పేద, మధ్యతరగతి ప్రజలకు చెందిన 60, 100 గజాల స్థలాలను చేర్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా అనుమతులు ఉండి బ్యాంకుల ద్వారా రుణం పొందిన ఆస్తులను కూడా 22ఏ జాబితాలో పెట్టడం దారుణం. ఇలా వివాదాల్లోకి నెట్టిన వాటిని ఆ జాబితా నుంచి తొలగించడానికి భారీగా కమీషన్లు డిమాండు చేస్తున్నారు. ఈ అంశంపై మంత్రులతో బహిరంగ చర్చకు భాజపా సిద్ధం' అని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు పాల్గొన్నారు.

# దీక్ష విరమించా నిరసన కాదు

(మొదటి పేజీ తరువాయి)

మహతో స్పష్టంచేశారు. పరీక్షల రద్దు తదితర ప్రధాన డిమాండ్లకు సోరెన్ సర్కార్ అంగీకరించడంతో మహతో సోమవారం అర్ధరాత్రి తన నిరాహార దీక్షను విరమించారు. ఆరుగురు దీక్ష చేస్తుండగా ఆయనతోపాటు ప్రేమ్ నాయక్, ఉమే హబీబాలు దీక్ష విరమించారు. రాహుల్ క్రాంతి, సబితా కుమారి, రూపేశ్ పాల్ దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష విరమించాక మహతో మీడియాతో మాట్లాడారు.

"ఆపింది నిరాహార దీక్ష మాత్రమే. నిరసనోద్యమం కాదు. పరీక్షల రద్దు డిమాండ్లు నెరవేరిన నేపథ్యంలో ఇకపై ఉద్యోగ నియామక బాధ్యతలు చూసే జేపీఎస్సీ, జేఎస్ఎస్సీల్లో సంస్కరణల కోసం 'జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ అభ్యర్థి సంస్కరణల మంచ్'ఆధ్వర్యంలో సరికొత్త ఉద్యమం ప్రారంభిస్తాం. పరీక్షల రద్దు నిజంగా విద్యార్థుల విజయమే. అయితే ఇంతటితో నిరసనోద్యమం ఆగిపోదు. అవినీతిరహిత ఉద్యోగ నియామక విధానం కోసం ముసాయిదా పత్రం సిద్ధంచేశా. ప్రశ్నపత్రాల లీకేజీల నివారణతోపాటు కఠినమైన నిబంధనల అమలు, అధికారుల్లో జవాబుదారీతనం పెంచడం వంటి ప్రతిపాదనలతో డ్రాఫ్ట్ బ్లూప్రింట్ రూపొందించా. ఫైనాన్షియల్ ఆడిట్ చేస్తామంటే సరిపోదు. ప్రతి పరీక్షను ప్రతి దశలో క్షుణ్ణంగా సరిచూసుకుని ఆడిటింగ్ చేయాలి. పరీక్ష నిర్వహించాక ఏవేవో తప్పిదాలు, అక్రమాలు జరిగాయనే కారణంతో పరీక్షను రద్దుచేసే పరిస్థితి రాకుండా చూసుకోవాలి. నియామక పరీక్షల్లో పేపర్ లీకేజీలు, అక్రమాలకు కఠిన శిక్షలు పడేలా నూతన చట్టం తీసుకురావాలి"అని అన్నారు. ఉద్యమవేదిక వద్ద పలువురు పరీక్షార్థులు సైతం తమ నిరసన కొనసాగుతుందని స్పష్టంచేశారు. "సీఐడీ, సిట్ దర్యాప్తునకు బదులు సీబీఐ విచారణ జరపాలన్న మా డిమాండ్ ఇంకా నెరవేరలేదు. ఇందుకోసం సైతం పోరాటం కొనసాగుతుంది"అని ఉద్యమకారులు వ్యాఖ్యానించారు. వీళ్లకు శాసనసభలో విపక్ష నేత, బీజేపీ సీనియర్ నాయకుడు బాబూలాల్ మరాండీ తన మద్దతు ప్రకటించారు.

డిమాండ్ల సాధనలో విజయం సాధించిన విద్యార్థులను లద్దాఖ్ సామాజికవేత్త, జంతర్‌మంత్‌లో ఇటీవల నిరాహార దీక్ష చేసిన సోనమ్ వాంగ్‌చుక్ అభినందించారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయి సోరెన్‌సైతం విద్యార్థులను అభినందించారు. మరోవైపు గత నియామక పరీక్షల ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు మంగళవారం సైతం ఆందోళన కొనసాగించారు. రాంచీలోని రాష్ట్ర సెక్రటేరియట్ ముందు ధర్నాకు దిగారు. ఎగ్జామినేషన్ రద్దు నిర్ణయంపై సీఎం పునరాలోచన చేయాలని కోరారు.

# క్షమాపణ కాదు.. కనీసం ఒప్పుకున్నారా?

**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాతీర్పు)**

నిషేధిత భూముల జాబితా విషయంలో జరిగిన తప్పును ఒప్పుకుని తాము సరిదిద్దుతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కానీ బీఆర్ఎస్ నేతలు క్షమాపణలు చెప్పడం కాదు కదా... కనీసం చేసిన తప్పులను ఎప్పుడైనా అంగీకరించారా అని ప్రశ్నించారు. పదేళ్ల ధరణి తప్పిదాలను అంగీకరించే ధైర్యం ఆ పార్టీ నేత హరీశ్‌రావుకు ఉందా అని నిలదీశారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ హరీశ్‌రావు ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. 'విమర్శలు చేయడం చాలా సులువు. కానీ బాధ్యత తీసుకోవడం అంత సులువు కాదు. 22ఏ జాబితా విషయంలో పొరపాటు జరిగిందని మేం బహిరంగంగానే అంగీకరించాం. ఆ పొరపాటును సరిదిద్దే బాధ్యత కూడా తీసుకున్నాం. కానీ వాళ్లు అధికారంలో ఉన్న కాలంలో ధరణి మాటున జరిగిన అక్రమాలను, రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను ఏనాడైనా ఒప్పుకున్నారా? క్షమాపణలు చెప్పారా? కానీ ఇప్పుడు మాత్రం ఈ సమస్యను రాజకీయంగా వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పేదవారి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాయం జరగనివ్వం. మేం తప్పును ఒప్పుకున్నాం. ఆ తప్పును సరిదిద్దుతున్నాం. కానీ మీకు ఆ ధైర్యం ఉందా? అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేదు. తప్పును అధికారుల మీదకు నెట్టి చేతులు దులుపుకోవడం మా విధానం కాదు. పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్‌రావుకు ఇప్పటికీ 30 శాతం కమీషన్లు ఎందుకు గుర్తొస్తున్నాయో అర్థం కావడం లేదు. వారు ఏ పద్ధతిలో పాలించారో ప్రజలు ఇంకా మర్చిపోలేదు. అసలు కాళేశ్వరం విషయంలో జరిగిన పరిణామాలకు హరీశ్‌రావు ఏనాడైనా బాధ్యత తీసుకున్నాడా? నేను మాత్రం తప్పు జరిగిందని చెప్పి బాధ్యత తీసుకున్నా. ఇదే నాకు, హరీశ్‌కు ఉన్న తేడా'అని పొంగులేటి అన్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ... 'తాటాకు చప్పుళ్లకు నేను భయపడను. నాపై ఏవైనా ఆరోపణలు చేస్తే ఆధారాలతో మాట్లాడాలి. వ్యాపార రంగంలో అనేక సంస్థలతో లావాదేవీలు జరగడం సహజం. వాటిని రాజకీయ ఆరోపణలకు ఉపయోగించుకోవడం సరైంది కాదు. నేను రెండు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్నా. రాత్రికి రాత్రి వచ్చిన వాడిని కాను. ఒక్కరోజులోనే వేల కోట్లకు ఎదిగిన వ్యక్తిని కాను. అంచెలంచెలుగా ఎదిగాను. నా నేపథ్యం ఏంటో రాష్ట్ర ప్రజలకు తెలుసు'అని పేర్కొన్నారు.

### ఆందోళన చెందాల్సిన పని లేదు

నిషేధిత 22ఏ జాబితా భూములు, ఆస్తులతో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పొంగులేటి స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, 24 గంటల్లోనే మేడ్చల్‌లో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ రాబోయే 15 రోజులపాటు రోజువారీగా ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తుందన్నారు. న్యాయబద్ధంగా ఉన్న ప్రైవేటు ఆస్తులను తక్షణమే రిజిస్ట్రేషన్లు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

- పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

**జమ్మికుంట, ఆగస్టు 18 ప్రజాతీర్పు**



జమ్మికుంట పట్టణంలో దేశిని కోటి గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, దుబ్బ మల్లన్న దేవాలయ చైర్మన్ రవీందర్, ఆకుల రాజేందర్, కనుమల్ల గణపతి, కార్మిక నాయకులు సామ్రాజ్యం, కోలాగాని రాజులతో పాటు కౌన్సిలర్లు శ్రీపతి నరేష్, మాచర్ల రాజు, గుర్రం కావ్య పరశురాం, కుదాడి తిరుపతి, బత్తుల లక్ష్మణ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ములుగురి ప్రశాంత్ కుమార్, దేశిని కోటి, మరెల్లి మల్ల గౌడ్ మాట్లాడారు. భూస్వాములు, పెత్తందారుల అరాచకాలు, అక్రమ పన్నుల వసూళ్లతో ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం సర్వాయి పాపన్న తిరుగుబాటు బావుటా ఎగరవేశారని కొనియాడారు. కేవలం 12 మంది మిత్రులతో ప్రారంభమై, 12 వేల మందితో గెరిల్లా సైన్యాన్ని నిర్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని గుర్తుచేశారు. గోల్కొండ కోటపై విజయం సాధించి, ప్రజలకు స్వతంత్రం, సమాన హక్కులు కల్పిస్తూ సమర్థవంతంగా పరిపాలన అందించారని కొనియాడారు. నేడు తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ల నేతృత్వంలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించడం హర్షణీయమని పేర్కొంటూ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాపన్న గౌడ్ ఆశయ సాధనకు, స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు గడ్డం దీక్షిత్, రాజేశ్వరరావు, గౌడ సంఘం నాయకులు నాగపురి రాజు, ప్రభాకర్, రాజు, అలాగే ప్రజా నాయకులు పూదరి రేణుక శివ, బొంగోని వీరన్న, మరపల్లి బిక్షపతి, శ్రీహరి, పంజాల అజయ్, దేశిని శ్రీనివాస్, పున్నం శీను, పాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

**కోరుట్ల ఆగస్టు 18 (ప్రజాతీర్పు)**

అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను పట్టణంలోని కౌండిన్య గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్ష, కోశాధికారులు పోతుగంటి రవి, గంగాధరి రంజిత్ మాట్లాడుతూ.. అన్యాయాన్ని ఎదిరించి సమానత్వం కోసం పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు పోతుగంటి వెంకటేశ్వర్లు, గంగాదరి రాజేంద్రప్రసాద్, లవకుమార్, భీమాగౌడ్, సత్యం, శేఖర్, శ్రీనివాస్, ప్రభాకర్, రవి, హన్మాండ్లు, మహేష్, సురేష్, అశోక్, నాగరాజు, హరికృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## సాయిబాబానగర్ డివిజన్‌లో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

**సాయిబాబానగర్, ఆగష్టు 18 ప్రజా తీర్పు**

కుత్బుల్లాపూర్ నియోజవర్గంలోని సాయిబాబానగర్ డివిజన్‌లోని లూయిస్ బ్రెయిలీ కమ్యూనిటీ హాల్, ఎస్ఆర్ నాయక్ నగర్ కమిటీ హాల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు హరికిరణ్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికిరణ్ పటేల్ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి, మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కరణ్ , కుత్బుల్లాపూర్ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫ్ఫార్ , ఏ బ్లాక్ మహిళా ఉపాధ్యక్షురాలు నాగశిరోమణి , చందు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా వైద్య అధికారి ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం

**నిజాంసాగర్ / ఆగస్టు 18 ( ప్రజా తీర్పు )**

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మరియు పిట్లం మరియు మొహమ్మద్ నగర్ మండల పీహెచ్సీ పరిధిలోని ఆశ కార్యకర్త మరియు ఆరోగ్య సిబ్బంది మరియు పర్యవేక్షకులకు గోర్గల్ హాల్ లో జిల్లా వైద్యాధికారి వెంకట్ ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు మరియు గర్భిణీ స్త్రీల నమోదు వ్యాధి నిరోధక టీకాలు సాధించిన ప్రగతి లు ఎన్ సి డి స్క్రీనింగ్ మరియు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల వివరాలు ప్రతి ఆశ మరియు ఆరోగ్య కార్యకర్త లకు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో డా. రోహిత్ కుమార్ మరియు జిల్లా వైద్యారోగ్య సిబ్బంది సిద్దు గౌస్ సంతోష్ పాల్గొన్నారు.

## శ్రావణ మాసంలో కోరుట్ల నుంచి ప్రత్యేక పుణ్యక్షేత్ర యాత్ర

**కోరుట్ల ఆగస్టు 18 (ప్రజాతీర్పు)**



శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టిసి కోరుట్ల డిపో ఆధ్వర్యంలో మూడు రోజుల ప్రత్యేక పుణ్యక్షేత్ర యాత్రను నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. ఈ యాత్రలో భాగంగా బీదర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, గానుగాపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి, కొల్హాపూర్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, పండరిపూర్ శ్రీ పాండురంగ స్వామి, తుల్జాపూర్ శ్రీ తుల్జాభవాని అమ్మవారి ఆలయాలను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 22న శనివారం రాత్రి కోరుట్ల నుంచి యాత్ర ప్రారంభమై, ఆగస్టు 25న మంగళవారం రాత్రి తిరిగి కోరుట్లకు చేరుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. యాత్రికుల సౌకర్యార్థం సూపర్ లగ్జరీ బస్సుతో పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి యాత్ర చార్జీ రూ. 4,000గా నిర్ణయించినట్లు వెల్లడించారు. రిజర్వేషన్లు, ఇతర వివరాల కోసం 99639 61503, 94404 85576 నంబర్లను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం డిపో మేనేజర్ మనోహర్‌ను 99592 25928 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. "ఆర్టీసీ ప్రయాణం -- సురక్షితం, శుభప్రదం, సుఖవంతం" అనే నినాదంతో భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని టీజీఎస్ఆర్టిసి కోరుట్ల డిపో అధికారులు కోరారు.



## ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్ట్ 18.**

కొండగట్టు వద్ద కరీంనగర్--జగిత్యాల ప్రధాన రహదారిపై నిన్న సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్పీ , ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, రహదారి పరిస్థితి, వాహనాల కదలిక, వాహన వేగం తదితర అంశాలపై సంబంధిత పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో విచారించి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, వాస్తవాలను వెలికితీసే విధంగా దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాహనదారులు అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందున్న వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తగా నడుపుతూ, ముందున్న వాహనాలకు తగిన దూరం పాటించాలని, ప్రధాన రహదారులపై మరింత అప్రమత్తంగా ప్రయాణించాలని తెలిపారు. ఎస్పి గారి వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డి టి ఓ మహమ్మద్ సందాని, మల్యాల సీ.ఐ రాజ్ కుమార్, ఎన్ హెచ్ అదికారులు ఉన్నారు.



## తాండూరులో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) ఆగస్టు 18**

తాండూర్ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సామాజిక సేవలు, సమాజంలోని అణగారిన వర్గాల కోసం సాగించిన పోరాటాన్ని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలకు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటానికి ప్రతీకగా నిలిచారని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పెద్దబోయిన శంకర్, వైస్ ప్రెసిడెంట్లు షేక్ మోమిన్ అలీ, శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు నవీన్ పటేల్, కటికల మల్లేష్, కార్యదర్శులు ప్రభాకర్, సాంబయ్య, సర్పంచ్ ఆకుల వెంకన్న, మరిశెట్టి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సాలిగామ భానయ్య, వాసాల అనిల్ కుమార్ పాల్గొన్నారు. అలాగే తాండూర్ మండల గౌడ సంఘం నాయకులు మొండి గౌడ్, మనోహర్ గౌడ్, వెంక గౌడ్, వెంకటేష్ గౌడ్, పున్నం గౌడ్, భాస్కర్ గౌడ్, మైనార్టీ నాయకులు గౌస్, పప్పీ, పెద్దబోయిన రవి, శంకర్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.



## జిల్లా ప్రొఫెషనల్ ఫోటో & వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసిసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం :

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల) ఆగస్టు 18**

మంచిర్యాల జిల్లా ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ ఉ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటో గ్రఫీ దినో త్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన "రక్తదాన శిబిరం" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ , మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ తూముల నరేష్, తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ గారు రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేసిన దాతలను అభినందించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీ అగ్గు సాగర్, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, రక్తదాతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## కీర్తిశేషులు కొండలరావు కుటుంబానికి చేయూత

పి,డి పద్మ 50 కేజీల బియ్యం అందజేత

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) ఆగస్టు 18**

స్థానిక పట్టణ కేంద్రం వికలాంగుల కాలనీకి చెందిన కీర్తిశేషులు కాంపాటి కొండలరావు కుటుంబానికి, చేయూతగా మంగళవారం 50 కేజీల బియ్యం పి,డి

ఈసం పద్మ అందజేశారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ (పిడి) పద్మ మానవత్వ దృక్పథంతో, స్థానికని పట్టణ కేంద్రం వికలాంగుల కాలనీకి చెందిన అనారోగ్యంతో మృతి చెందిన కీర్తిశేషులు కాంపాటి కొండలరావు కుటుంబాన్ని ఆమె కలిసి ప్రగాఢ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపి, తోచిన సహాయంగా దశదినకర్మలకు గాను 50 కేజీల బియ్యాన్ని అందజేశారు, మృతుని కుటుంబీకులు పి,డి పద్మకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ నీకోసం చేసేది నీతోనే పోతుందని, కుటుంబం కోసం చేసేది కుటుంబంతోనే పోతుందని, ఇతరులకు చేసేది పది కాలాలపాటు ఇలలో ఉంటుందన్నారు.

## మొగల్ సామ్రాజ్యంపై వీరోచిత పోరాటం చేసిన యోధుడు సర్వాయి పాపన్న గౌడ్

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 18:**



మొగల్ సామ్రాజ్య నిరంకుశ పాలనపై వీరోచిత పోరాటం చేసిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వెల్గటూర్ మండలంలోని తాళ్ల కొత్తపేట గ్రామంలో సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు టి యు ఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ లో గౌడ కుటుంబంలో జన్మించిన పాపన్న గౌడ్ భూస్వాముల దౌర్జన్యాలకు, మొగల్ నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా సబ్బండ కులాలతో సైన్యం ఏర్పాటు చేసి మొఘల్ సైన్యాలను ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగరవేసిన యోధుడని అన్నారు. ఈ కార్యక్రమంలో చెగ్యాం హాజీ ఎంపిటిసి రంగు తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ ద్యావనపల్లి లక్ష్మీ -ఎల్లయ్య, గౌడ సంఘం నాయకులు బొంగాని లక్ష్మిరాజం గౌడ్, రంగు రమేష్ గౌడ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రంగు భూమయ్య గౌడ్ , చెగ్యాం గ్రామ శాఖ అధ్యక్షులు ధనిశెట్టి శ్రీనివాస్, ఎస్ కె దస్తగిరి, కోల లచ్చయ్య గౌడ్, బద్దం రవీందర్ రెడ్డి, ఊట్ల బాపు, ఊట్ల సత్తయ్య, బద్దం కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ లో గణేష్ మండపాలన్నింటికీ ఉచిత విద్యుత్

- కరెంట్ ఛార్జీలన్నీ కార్పొరేషన్ భరించాలని నిర్ణయం
- లక్ష్మీపూర్, మల్కాపూర్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు 18**



కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాలన్నింటికీ ఉచితంగా కరెంట్ ను అందించాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. అందుకు అయ్యే కరెంట్ బిల్లులన్నీ కరీంనగర్ కార్పొరేషన్ చెల్లిస్తుందని ప్రకటించారు. భక్తియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఏటా దాదాపు 2 వేల గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. గత మూడేళ్లుగా ఈ మండపాలకు వినియోగిస్తున్న కరెంట్ ఛార్జీలను మొత్తం బండి సంజయ్ కుమార్ తన సొంత డబ్బులు వెచ్చించి చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించిన నేపథ్యంలో గణేశ్ మండపాల కరెంట్ బిల్లులన్నీ కార్పొరేషన్ చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం విశేషం. కరీంనగర్ పర్యటనలో భాగంగా ఈరోజు 21వ డివిజన్ విద్యానగర్ లోని శ్రీరాంనగర్ కాలనీలో కోటి రూపాయల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ తనను గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.22 వేల కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అందులో 5 వేల కోట్లతో జాతీయ రహదారులను నిర్మించినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి రూ.5 లక్షల చొప్పు నిధులు ఇచ్చానని, రాబోయే రోజుల్లో పెద్ద మొత్తంలో నిధులిచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తానని చెప్పారు. మరోవైపు తనను నమ్మి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బీజేపీకి అప్పగించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు 100 రోజుల్లోనే రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ పేరుతో రూ.940 కోట్ల నిధులు తెచ్చి కరీంనగర్ ను అభివృద్ధి చేసినట్లు వివరించారు. వరంగల్ కు సైతం స్మార్ట్ సిటీ నిధులొచ్చినప్పటికీ అక్కడ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తనపై నమ్మకం ఉంచిన కరీంనగర్ ను అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణలో తెలుగు రాష్ట్రాల్లోనే అగ్రభాగాన ఉంచేందుకు శాయాశక్తుల క్రుషి చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రస్తుతం అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లంతా కలిసికట్టుగా ఉంటూ కరీంనగర్ ను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం 16వ డివిజన్ లక్ష్మీపూర్, మల్కాపూర్ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన వాటర్ పైప్ లైన్ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు.

## రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్ళ మార్పిడి

- సోమాజిగూడ యశోద ఆసుపత్రి రోబోటిక్ సర్జన్ దాచేపల్లి సునీల్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 18.**




ఆధునిక విధానాల్లో రోబోటిక్ సర్జరీ అనేది విజయవంతమైన ఆపరేషన్ అని దీని ద్వారా మోకాళ్ళ మార్పిడి చేయించుకోవచ్చునని హైదరాబాద్ లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రికి చెందిన ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాచేపల్లి సునీల్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం సోమాజిగూడ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు మోకాళ్ళ మార్పిడి.. రోబోటిక్ సర్జరీ ప్రయోజనాలపై ప్రముఖ రోబోటిక్ సర్జన్ దాచేపల్లి సునీల్ అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్ తర్వాత చాలా మందికి నొప్పి నుంచి ఉపశమనం లభించి సాధారణ జీవితానికి తిరిగి వచ్చి తమ పనులు తామే చేసుకోవచ్చునన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 30 లక్షలకు పైగా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని వివరించారు. సరైన సమయంలో మోకాళ్ళ మార్పిడి చేయించుకోవడం ద్వారా 20 నుంచి 25 సంవత్సరాలు మంచి ఫలితాలు వుండే అవకాశం ఉందన్నారు. అనవసరమైన ఖర్చులు కంటే ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆధునిక టెక్నాలజీపై ఖర్చు చేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలను ప్రతి రోజు నిర్వహిస్తున్నట్లు రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిజం చెప్పాలంటే మోకాళ్ళ మార్పిడి అనేది ఒక విజయవంతమైన రోబోటిక్ సర్జరీ అని కిడ్నీలపై దుష్ప్రభావాల ప్రమాదాన్ని కూడా తగ్గించుకునేందుకు ఇది చక్కని అవకాశమన్నారు. మోకాళ్ళ మార్పిడి చికిత్స చేయకుండా వదిలేస్తే కొంతమంది ఒక దశలో మంచానికే పరిమితమైన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఉదహరించారు. ఈ అవగాహన సదస్సులో సీనియర్ మేనేజర్ సుధీర్ కుమార్, మేనేజర్ హరీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## చంద్రయ్య పల్లి గ్రామంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**నర్సంపేట రూరల్,ఆగస్టు 18 , ప్రజా తీర్పు ప్రతినిధి:**



నర్సంపేట చంద్రయ్యపల్లె గ్రామంలో ఈరోజు సాయంత్రం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా బాణా సంచాలతో మిఠాయి అజ్మీర వస్త్రం నాయక్ గ్రామ సర్పంచ్ కేకును కట్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ భాష బోయినశీను గ్రామ పార్టీ అధ్యక్షుడు పాపయ్య సొసైటీ డైరెక్టర్ ఏడెల్లిరాజి రెడ్డి మాజీ సర్పంచ్ రవి గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెండో వార్డ్ శంకర్ ఎన్ఎస్ఐ యూత్ ప్రెసిడెంట్ నర్సంపేట చిట్టి ప్రశాంత్ , గౌరవ అధ్యక్షులు ఎగే ఐలయ్య , వంగ పురుషోత్తం, భాష బోయిన ఐలయ్య, సుంకరి రాజు రెడ్డి, వంగరాజు, పేర్ల స్వామి, బద్రి నాయక్ బరిగెలకుమారి, జరుగును సాంబయ్య, సింగపైన బిక్షపతి, రాజు భాష బోయిన గణేష్, తదితరులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను అద్భుతంగా చేశారు



## ఆగస్టు 19న ఐబీ తాండూర్ బంద్‌కు తుడుందెబ్బ పిలుపు

- ఏజెన్సీ ప్రాంతంలో పోలీస్ ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండల రిపోర్టర్) ఆగస్టు 18**

ఏజెన్సీ ప్రాంతంలో పోలీస్ ఉద్యోగాల్లో ఆదివాసీ యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఐబీ తాండూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాల్లో న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ యువతకు స్థానిక హక్కులను పరిరక్షిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 75 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఆదివాసీ యువతకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న బంద్‌కు వ్యాపారులు, ప్రజలు, యువత సహకరించి విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం మణికుమార్, తుడుందెబ్బ మండల అధ్యక్షులు యపాల సమ్మయ్య, మంచిర్యాల జిల్లా కార్యదర్శి అరికిల శంకర్, మండల ప్రధాన కార్యదర్శి బుర్స ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు గావుడే మల్లేష్, కొలవార్ సంఘం మండల అధ్యక్షులు గొలిశెట్టి బాపు, మండల నాయకులు ఊరడి వెంకటేష్, బోగారపు ప్రశాంత్, ఎడ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ రాజమల్లయ్యకు సన్మానం

**రామడుగు, ఆగస్టు18 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



రామడుగు మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దాసరి రాజ మల్లయ్యను రామడుగు మాజీ ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ ఆధ్వ ర్యంలో మంగ ళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమల్లయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపల్లి మాజీ సర్పంచ్ జవ్వాజి శేఖర్, జెట్టిపల్లి వీరయ్య, కర్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య చేసి ప్రమాదం గా చిత్రీకరించిన నిందితుడు అరెస్ట్ రిమాండ్

- 36 గంటల్లోనే కేసులు చేదించిన పోలీసులు అభినందించిన జిల్లా ఎస్పీ

**(వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) ఆగస్టు 18.**



మెదక్ జిల్లా చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ 15.08.2026 నాడు జరిగిన హత్య నేరం కేసులో పోలీసులు వేగవంతంగా స్పందించి కేవలం 36 గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి మృతురాలి యొక్క మొబైల్ ఫోన్ మరియు లారీ ని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగింది. నిందితుడి వివరాలు: రాంవీర్ సింగ్ తండ్రి విద్యా రాం, వయస్సు 45 సంవత్సరాలు, వృత్తి లారీ డ్రైవరు, =/శీ నాంగల సరిహదీ, ఇటాభ జిల్లా, ఉత్తర ప్రదేశ్ ఫిర్యాదుదారుడు శ్రీ మాలోత్ వసూరం తండ్రి రాం సింగ్,(55), వ్యవసాయదారుడు, పులీగుట్ట తండా ౧/శీ చెట్లతిమ్మాయిపల్లి గ్రామం, మాసాయిపేట్ మండలానికి చెందినవారు. తన భార్య మన్ని ప్రతిరోజు కూరగాయలను తీసుకొని మల్కాజ్గిరి కూరగాయల మార్కెట్లో అమ్మి తిరిగి రాత్రి 8 లేక 9 గంటల వరకు ఇంటికి వచ్చేది. తేదీ 14.08.2026 నాడు సుమారుగా మధ్యాహ్నము 01:30 సమయంలో తన భార్య మన్ని రోజు మాదిరిగానే ఇంటి వద్ద నుండి కూరగాయల అమ్మడానికి మల్కాజ్గిరి కూరగాయల మార్కెట్ కు వెళ్ళింది, రాత్రి ఇంటికి రాలేదు. మరుసటి రోజు ఉదయం సుమారుగా 6 గంటల సమయంలో తన భార్య మన్ని మాసాయిపేట గ్రామ శివారులోని ఎన్ హెచ్ 44 రోడ్డుకు ప్రక్కన బంగారమ్మ గుడి దగ్గర ట్రక్ లే బై దగ్గర చనిపోయి ఉన్నదని తెలియగానే అక్కడికి వెళ్లి చూడగా తన భార్యకు ఏదో ఒక గుర్తు తెలియని వాహనము ఆమె మీద నుండి వెళ్లడం వలన చనిపోయినట్లుగా ఉన్నది మరియు తన భార్య మరణము పై అనుమానం కలదని పిర్యాదు చేసినాడు , ఇట్టి పిర్యాదు మేరకు చేగుంట పోలీస్ స్టేషన్‌లో క్రైం నం.232/2026, ఖ/ం 106(1) దీచీూ కింద కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదు అందిన వెంటనే డీఎస్పీ తూప్రాన్ శ్రీ జె. నరేందర్ గౌడ్ గారి ఆదేశాల మేరకు శ్రీ సైదా జ× రామయంపేట మరియు జి. చైతన్య రెడ్డి ఎస్. ఐ చేగుంట నేతృత్వం లో ని ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, జజుఎ కెమరా మరియు మృతురాలి యొక్క సెల్ ఫోన్ డాటా ఆదారంగా దర్యాప్తు చేపట్టి ఇట్టి దర్యాప్తులో మృతురాలికి మరియు నిందితుడికి మధ్య గత 6 నెలలుగా సాన్నిహిత్యం ఉండి వీరిద్దరి మధ్య గతంలో డబ్బుల విషయంలో గొడవలు ఉన్నాయి. నిందితుడు మృతురాలిని కలిసినప్పుడల్లా డబ్బుల విషయంలో నిందితుడిని నిలదీస్తూ ఉండేది. ఇట్టి విషయంను నిందితుడు మనుసులోపెట్టుకొని ఉద్దేశపూర్వకంగా ఆమెను ఎలాగైనా చంపాలని తేదీ 14/08/2026 రాత్రి సుమారుగా 12 గంటల సమయంలో మృతురాలికి ఫోన్ చేసి మాసాయిపేట్ గ్రామ శివారులోని బంగారమ్మ గుడి ట్రక్ లే బై దగ్గరికి పిలిపించుకొని ఆమెకు మద్యం తాగించి మృతురాలిని కొట్టి కిందపడవేసి తన యొక్క లారీని ఆమె పై నుంచి ఎక్కించి చంపినాడు, ఇట్టి కేసు లో పోలీస్ వారు 36 గంటల వ్యవదిలో నిందితుడిని పట్టుకొని రిమాండ్ కు పంపడం జరిగింది . ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులతో సానిహిత్యంగా ఉండటం వలన ఇటువంటి నేరాలు జరుగుతున్నాయి కాబట్టి దయచేసి ప్రతి ఒక్కరూ కూడా జాగ్రత్తగా ఉండవలసిందిగా చేగుంట పోలీస్ కోరుతున్నాను. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని డీఎస్పీ తూప్రాన్ శ్రీ జె. నరేందర్ గౌడ్ గారి పర్యవేక్షణలో, సీఐ రామాయంపేట శ్రీ బి. సైదా గారి ఆధ్వర్యంలో ఎస్ఐ చైతన్య రెడ్డి, ఎస్. ఐ భిక్యా నాయక్ , కానిస్టేబుళ్లు శ్రీనివాస్ రాథోడ్ , నరేందర్ గౌడ్, మహేశ్ , లక్ష్మీపతి , గోపాల్ ,సత్యం , సాజిద్, యాదగిరి లు సమర్ధవంతంగా పని చేసి నిందితుడిని అరెస్టు చేశారు. వారి కృషిని మెదక్ జిల్లా అదనపు సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ కుమార్ ఐపీఎస్ మరియు సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ అభినందిస్తూ తగిన రివార్డు ప్రకటించారు.



## రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు రూ.1 లక్ష విరాళం

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) ఆగస్టు 18**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనుల కోసం హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన శ్రీమతి ఖమ్మంపాటి శ్యామల- శ్రీకాంత్ దంపతులు రూ.1 లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ చెక్కును దేవస్థానం ప్రోటోకాల్ కార్యాలయంలో ప్రజాసంబంధాల అధికారి (పీఆర్ఓ) పెరుక శ్రీనివాస్‌కు వారు అందజేశారు. అనంతరం దంపతులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం అందించి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అకౌంట్స్ విభాగం అడ్వైజర్ ఆగమ రావు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## రైతులకు ఉచితంగా మిర్చి నారు పంపిణీ చేసిన ఉప సర్పంచ్ గుగులోతు వీరన్న...

- రైతులకు ఆదర్శంగా నిలిచిన ఉప సర్పంచ్...
- భళా ఉప సర్పంచ్...

**కురవి ఆగస్టు 18 (ప్రజాతీర్పు విలేఖరి)**

కురవి మండలంలోని ఎలుక చెట్టు తండా గ్రామ ఉప సర్పంచ్ గుగులోతు వీరన్న తన సొంత తండా అయిన ఎలుక చెట్టు తండా రైతులకు ఉచితంగా సొంత ఖర్చులతో 120 మంది రైతులకు,ఒక్కొక్కరికి ఐదు వేల మొక్కల చొప్పున దాదాపు ఆరు లక్షల విలువ చేసే మిర్చి నారును మంగళవారం నాడు పంపిణీ చేయడం జరిగింది. ఉప సర్పంచ్ అయిన సందర్భంగా తన తండా ప్రజలకు ఏదైనా మంచి పని చేయాలనే సంకల్పంలో భాగంగా మిరప నారు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. భవిష్యత్ లో తన వంతుగా మరిన్ని ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తానని అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాలోత్ రమేష్, బి ఆర్ ఎస్ పార్టీ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవి నాయక్,బి ఆర్ ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు,సీనియర్ నాయకులు భూక్య శ్రీను,నాయకులు భూక్య రాజు,భూక్య భాస్కర్,బానోత్ నరేష్,సోషల్ మీడియా ఇంచార్జి భూక్య మల్సూర్,ఎలుక చెట్టు తండా రైతులు పాల్గొన్నారు.



## టేకులపల్లి మండలంలో ఏకలవ్య పాఠశాలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మిక తనిఖీ

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు )ఆగస్టు 18**

టేకులపల్లి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (౧+జువీ=)ను ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య గఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలనిఆదేశించారువిద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీ ద్వారా పాఠశాలలోని పరిస్థితులను స్వయంగా తెలుసుకుని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



## సుజాతనగర్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కేతవరపు కళ్యాణ్ కి ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (ప్రజా తీర్పు)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ స్థానిక ఎస్సై కేతవరపు కళ్యాణి కి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు మండలాల నాయకులు కళ్యాణికి శాలువాతో సన్మానించి పూల బొక్కే చేతికిచ్చి స్వీట్స్ పంచి నాయకులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా జిల్లా సంఘం నాయకులు మండలాల సంఘం నాయకులు కుల సంఘం నాయకులు పలువురు ఆమెను అభినందించారు ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఉబ్బనపల్లి కాశయ్య, కురుమళ్ళ శంకర్, జిల్లా అధ్యక్షులు కడియాల సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాడిగల మల్లేష్, సహారా కాశయ్య ఉబ్బనా పల్లి కృష్ణ, మాడుగుల ముక్తేశ్వరరావు, చుంచుపల్లి అధ్యక్ష కార్యదర్శులు కడియాల శ్రీనివాస్ మండల కనకరాజు, తదితరులు పాల్గొన్నారు



## మౌలాలిలో ఘనంగా బోనాల వేడుకలు: పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

**(వినోద్, ప్రజా తీర్పు,మౌలాలి,మల్కాజిగిరి) ఆగస్టు 18**

బోనాల పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని మౌలాలి 186వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పొతుల ఉమా మహేశ్వరి వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మౌలాలి ప్రాంతంలో సేవలందిస్తున్న జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె స్వయంగా చీరలను అందజేశారు. ఈ సందర్భంగా పొతుల ఉమా మహేశ్వరి మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పండుగ పూట వారి శ్రమను గుర్తించి, గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికుల సేవలను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



## కలెక్టరేట్లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**నిర్మల్ జిల్లా ,ఆగస్టు 18 (ప్రజాతీర్పు )**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన చూపిన పోరాట పటిమ, ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, సేవలను నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొఘల్, కుతుబ్ షాహీ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలను, బహుజనులను ఏకం చేసి పాపన్న గౌడ్ సైన్యాన్ని తయారు చేశారని అన్నారు. పాపన్న గౌడ్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. అందరం ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు అమరవేణి నర్సగౌడ్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాలు గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఆయన తెగువ నేటి తరాలకు ఆదర్శమని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిఆర్ఓ రాథోడ్ రమేష్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సి కార్పొరేషన్ శంకర్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు, కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## షానగర్‌లో మెడికల్ క్యాంపు

**రామడుగు, ఆగస్టు 18 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండలంలోని షానగర్ గ్రామంలోని భూలక్ష్మి చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం షానగర్ హెల్త్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గునుకొండ శైలజ అశోక్‌కుమార్ క్యాంపును సందర్శించి గ్రామ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే హెచ్ఐవీ వ్యాధి వ్యాప్తి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రావణ్, ఏఎన్ఎంలు విమల రెడ్డిమల్ల, ప్రమీల, ఆశా వర్కర్లు సుజాత, రేణుకతో పాటు యువకులు ముదం శ్రీధర్, కొత్త రమేష్, కొత్త తిరుపతి, చిరుత మధు, చిరుత సురేష్, రామ్‌గారి వెంకటేష్, ముదం రవీందర్, శ్రావణ్, గునుకొండ ఆనందం, భూమయ్య, వీరమల్లు పాల్గొన్నారు.



## మాదారం-3 ఇంక్లైన్‌లో దోమల నివారణపై ఇంటింటా అవగాహన

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలం ప్రతినిధి) ఆగస్టు 18**

తాండూర్: మాదారం-3 ఇంక్లైన్ గ్రామపంచాయతీ పరిధిలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు ఇంటింటా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లను సందర్శించి దోమల మందును పిచికారీ చేయడంతో పాటు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్, సర్పంచ్ చందనాల రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. దోమల నివారణ చర్యల్లో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని వారు కోరారు.

# గ్రామదేవత శ్రీ శీతల దేవి శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ






- వేలాదిగా బోనాలు, మొక్కులు సమర్పించిన మహిళా భక్తులు

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 18**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన గ్రామదేవత శ్రీ శీతల దేవి శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని బోనాలు, ఒడు బియ్యం, చీర--సారెతో పాటు వివిధ మొక్కులను సమర్పించారు. ఆలయంలో ఉదయం నుంచి సుమారు ఉదయం 11:30 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా 1,003 బోనం టికెట్లు, 1,241 బెల్లం శాఖ మొక్కులు, 28 పట్నం వేయుట సేవలు నమోదైనట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేములవాడకు వచ్చే భక్తులు ముందుగా స్వామివారిని దర్శించుకుని, అనంతరం గ్రామదేవత శ్రీ శీతల దేవి శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఎన్నో సంవత్సరాలుగా ఆనవాయితీగా కొనసాగుతోంది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు తమ మొక్కులను అమ్మవారికి సమర్పించడం విశేషం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి గారు ఆలయ అధికారులకు తగిన సూచనలు చేయగా, అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వివరాలను శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి (పీఆర్ఓ) పెరిక శ్రీనివాస్ తెలిపారు.



## ఎండపల్లిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 18:**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలు, అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు, సేవలను గౌడ సంఘం నాయకులు గుర్తుచేసుకున్నారు. నేటి యువత పాపన్న గౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తోడేటి రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు బొంగానే సత్తయ్య గౌడ్, సంఘం డైరెక్టర్లు, సభ్యులు, గౌడ సంఘం యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సాగుచేసిన పంట విత్తనాలు నమోదు చేయించుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి ) ఆగస్టు 18:**



రైతులు వర్షాకాలంలో తమ పొలంలో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు ప్రాధాన్య వరి రకాల విత్తనాలను సాగు చేసిన రైతులు తప్పని సరిగా విత్తనాల నమోదు చేసుకోవాలని ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ తెలిపారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ ఎం టి సోనా, జై శ్రీరామ్,కెఎన్ఎం -1638, డబ్ల్యూ జి ఎల్ -44, కెఎన్ఎం - 7715 రకాల విత్తనాలకు ఈ నిబంధన వర్తిస్తుంది. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ వద్ద పాసుబుక్, మొబైల్ నంబర్, విత్తన రకం, బ్యాగుల సంఖ్య నమోదు చేయిం చుకోవాలి. గత పంట నుంచి సొంత విత్తనాన్ని ఉపయోగించిన రైతులు స్వీయ ప్రకటన పూరించాల్సి ఉంటుంది. అనంతరం తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా టి-ఆగ్రీ సీడ్స్ పోర్టల్లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే ఈ సీజన్లో మండలానికి ఎల్ ఆర్జీ-133-33 రకం 95 కందుల సంచులు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ కందుల సంచులను మండలంలోని అన్ని రైతువేదిక కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఒక్కో సంచి ధర రూ.520 ఉండగా, అందులో ప్రభు త్వం రూ.240 రాయితీ అందిస్తుండగా రైతులు రూ.280 చెల్లిం చాల్సి ఉంటుందని, ఒక్కో సంచిలో నాలుగు కిలోల కందులు ఉంటాయని, కంది పంటను సాగు చేయాల నుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ప్రతులతో రైతువేదికలో సంప్రదించాలని తెలిపారు.



## నాయకులగూడెంలో టీబీ ఎక్స్‌రే క్యాంపు ప్రారంభం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (ప్రజాతీర్పు)**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ పరిధిలోని సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నాయకులగూడెం ప్రాథమిక పాఠశాలలో పీఎంటీబీఏ టీబీ ఎక్స్‌రే క్యాంపును మంగళవారం ప్రారంభించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి ఆధ్వర్యంలో, డాక్టర్ వెంకటేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రావణి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలు టీబీ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు పొందడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. క్యాంపులో ప్రజలకు టీబీ నిర్ధారణకు సంబంధించిన ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సాయి కుమార్, హెల్త్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వీ చిన్నమ్మాయి, ఏఎన్ఎం స్వరూప, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, గంగ, టీబీ అలర్ట్ ఇండియా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**రామడుగు, ఆగస్టు 18 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

యల్ యం డి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (జిల్లా మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ) ఆధ్వర్యంలో మహిళలకు కమర్షియల్ పద్ధతిలో బ్యూటీషియన్ శిక్షణా కోర్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా మేనేజర్ తెలిపారు. 15 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు, గృహిణులు, విద్యార్థినులు, ఉద్యోగినులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. బ్యూటీషియన్ బేసిక్ కోర్సు 45 రోజుల పాటు, అడ్వాన్స్ కోర్సు 90 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో ఐబ్రోస్, ఫెషియల్స్, పెడిక్యూర్, మెనిక్యూర్, హెయిర్ కట్స్, ఆయిల్ మసాజ్, హెయిర్ స్టైల్, మేకప్ తదితర అంశాలను బోధిస్తారు. అడ్వాన్స్ కోర్సులో హెయిర్ కట్స్, పర్మనెంట్ స్ట్రెయిటనింగ్, పర్మనెంట్ కర్ల్, కెరాటిన్ ట్రీట్‌మెంట్, ఫ్యాషన్ కలర్స్, బ్రైడల్ మేకప్, బ్రైడల్ మెహందీతో పాటు అన్ని రకాల సారీ డ్రాపింగ్, ప్రీ-ప్లీటింగ్ పద్ధతుల్లో శిక్షణ ఇస్తారు. సారీ కట్టు విధానంలో ప్రత్యేకంగా 10 రోజుల శిక్షణ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. బేసిక్ కోర్సు ఫీజు రూ.4,000, అడ్వాన్స్ కోర్సు ఫీజు రూ.6,000 కాగా, సారీ కట్టు శిక్షణ ఫీజు రూ.800గా నిర్ణయించినట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తయిన అనంతరం ప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్ అందజేస్తారు. దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ జత చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 28 చివరి తేదీ కాగా, ఆగస్టు 31 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణ సమయం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థుల సౌకర్యాన్ని బట్టి హాఫ్‌డే లేదా ఫుల్‌డే శిక్షణ పొందే అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు 7660022511, 8500616491 నంబర్లను సంప్రదించాలని జిల్లా మేనేజర్ కోరారు.

# దివ్యాంగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

- దివ్యాంగులకు హామీలు ఇచ్చి, అమలు విస్మరన
- బిసి కులాల సమన్వయ వేదిక అధ్యక్షులు బొమ్మ రఘురాం నేత.
- సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ.6

**(మొక్క ఉపేందర్, ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) ఆగస్టు, 18:**



అసెంబ్లీ ఎన్నికల ముందు దివ్యాంగులకు హామీలు ఇచ్చి ఎన్నికల తర్వాత అధికారం చేతబట్టి వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులను మోసం చేస్తోందని బిసి కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురామ్ నేత విమర్శించారు. మంగళవారం నాడు హస్తినాపురం లోని దివ్యాంగుల సదనంలో సోషల్ జస్టిస్ పార్టీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఎం ఎస్ యాదవ్ ఆధ్వర్యంలో దివ్యంగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి బొమ్మ రఘురాం నేత ప్రసంగించారు. ఎన్నికల ముందు పెన్షన్లు రెండు వేల రూపాయలు పెంచి 6వెలు రూపాయలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ. ఎన్నికల తర్వాత ఒక్క రూపాయి కూడా పెంచలేదని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి ప్రజలను ఓట్ల అడిగి గద్దెనెక్కి అనంతరం మోసం చేస్తున్నారు. రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారంలో సర్కారులో చిత్తశుద్ధి లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యంగుల చట్టం అమలు చేయకపోవడం వల్ల దివ్యాంగులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు దివ్యాంగుల శాఖకు కమిషనర్ ను నియమించకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ బ్యాంకు రాజకీయాలు మానుకోవాలని, అత్యంత బలహీనులైన దివ్యాంగులకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో దివ్యంగులందరి తోటి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాపూర్ బాలస్వామి, హైడ్రా ఏరియా ఇన్చార్జ్ వరంగల్ రమేష్, ప్రముఖ సంఘ సేవకుడు కాసేట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గార్లలో2 రోజుల నుంచి తాగు నీటి కష్టాలు

- చుట్టూ తాగు నీరున్నా మంచినీటి సరఫరా ఎందుకు లేదన్నా....!

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి )ఆగస్టు 18**



గార్ల. స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పట్టణ ప్రజలకు వరుసగా రెండు రోజులుగా తాగునీరు పంపిణీ లేక ప్రజలుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పరిధి పట్టణ కేంద్రంలో రాజీవ్ టెక్నాలజీ బావి ఉన్నది, పాకాల చెక్ డాం వద్ద నీరు నిల్వ ఉన్నది, పట్టణ కేంద్రంలోని వాటర్ ట్యాంక్ వద్ద గతంలో రెండు బోరు బావులు వేసి ఉన్నారు. ప్రజలకు తాగునీరు అందించడంలో మాత్రం మేజర్ గ్రామ పంచాయతీ నిర్వాహకులు వైఫల్యం చెందారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,ఇటీవల వర్షాలు కురవడంతో గ్రామ పరిసర ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, తాగునీటి సరఫరా మాత్రం నిలిచిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా ఇంటింటికీ నీటి సరఫరా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు ప్రత్యామ్నాయ నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించి ప్రజలకు నీరు అందించడంలో పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు, తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, కొందరు ప్రైవేట్‌గా నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

**సంబంధిత అధికారులు స్పందించాలి**

రెండు రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజల పరిస్థితిని పంచాయతీ అధికారులు వెంటనే పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించి తక్షణమే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.



## బోడుప్పల్ బంగారు మైసమ్మ బోనాల ఏర్పాట్లపై సమీక్ష

**మేడిపల్లి, ఆగస్టు 18 ( ప్రజాతీర్పు )**

బోడుప్పల్, ఆగస్టు: ఈ నెల 23న జరగనున్న బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమీక్షించారు. మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, మేడిపల్లి సీఐ జలేందర్ కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాల రోజున భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడటం, తాగునీటి సదుపాయం కల్పించడం, విద్యుత్ అంతరాయం లేకుండా చూడడం, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, కొత్త కిషోర్ గౌడ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, రసాల వెంకటేష్ యాదవ్, ధనగళ్ల యాదగిరి, చిరాల నర్సింహారెడ్డి, ఆలయ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి, ఆలయ నిర్వాహకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## ఫర్టిలైజర్ యాప్ గందరగోళం తో రైతులు ఆగమాగంలో స్టాక్ లో కూడా బుకింగ్

- ఎలాంటి అవకతతో కూడా జరగలేదు సిఈఓ అశోక్, పిఏసిఎస్ డైరెక్టర్ ఉదండపురం నరసింహులు వివరణ.
- రైతులకు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మద్దతుగా తెలిపి నిరసన వ్యక్తం చేశారు.

**(వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్) ఆగస్టు 18**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం మాసాయిపేట మండల కేంద్రంలో రైతులు తీవ్రస్థాయిలో యూరియా యాప్ పై తీవ్ర గందరగోళం నెలకొనడంతో రైతు వేదికను ముట్టడించి నిరసన తెలిపారు. మాకు బుక్ అయిన తర్వాత వేరే వాళ్లకు 250 బ్యాగులు అమ్ముకుంటున్నారని రైతులు ఆరోపించారు. బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ యూరియా యాప్ వల్ల నిరక్షరాస్యత ఉన్న రైతులు సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫర్టిలైజర్ యాప్ ను పూర్తిగా ఎత్తివేసి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **సి ఓ, పిఏసిఎస్ డైరెక్టర్ వివరణ:** రైతులు ఆరోపణలకు వెంబటనే స్పందించిన సీవో అశోక్ రైతుకు వేదిక కొచ్చి ఎంఏఓ కవిత ఆధ్వర్యంలో స్టాక్ ను చెక్ 550 బ్యాగులు రాగా అందులో రైతులు తీసుకొని వెళ్లగా ఇంకా 35 బ్యాగులు మిగిలి ఉండాలని దానికి బదులు 39 బ్యాగులు ఉన్నాయని ఎవరో ఒక రైతు 4 బ్యాగులు బుక్ చేసుకున్న తర్వాత తీసుకు వెళ్లలేదని నిర్ధారించారు వచ్చిన స్టాకు అమ్మిన స్టాకు సరిపోయిందని పైలట్ ప్రాజెక్టు కింద మొదలుపెట్టిన యాప్ లో కొన్ని పొరపాటు జరగడం వల్ల రైతులకు ఈ సమస్య వచ్చిందని సి ఓ అశోక్, పిఏసిఎస్ డైరెక్టర్ ఉదండపురం నర్సింలు వివరణ ఇచ్చారు.

## వాస్తవ కథనాలు రాస్తే కేసులు పెట్టడం అమానుషం

కేసు ఎత్తివేయాలని బిఆర్ఎస్ నాయకుల డిమాండ్.

**జమ్మికుంట, ఆగస్టు 18 ప్రజాతీర్పు**



ప్రజల గొంతుకగా ఉండి అధికారులు ప్రజాప్రతినిధుల పై వాస్తవ కథనాలు రాసే పత్రిక విలేకరులపై కేసులు పెట్టడం అమానుషమని తక్షణమే కేసును విత్ డ్రా చేసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, సహకార సంఘం అధ్యక్షులు పొన్నగంటి సంపత్, మాజీ మార్కెట్ చైర్మన్ పోలినేని సత్యనారాయణ రావు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారులుగా పని చేస్తున్న వేణుగోపాలరావు జాతీయ జెండాను అవమానపరిచే విధంగా చెప్పులు వేసుకుని ఎగురవేయడం జరిగిందని ఈ దృశ్యాన్ని గమనించిన అక్కడి నినాదం స్టాఫ్ రిపోర్టర్ రాజ్ కుమార్ ఇదే కథనాన్ని వార్తా రూపంలో రాయడంతో అతనిపై స్థానికంగా ఉన్న తాహసిల్దార్ సంతోష్ ఉద్దేశపూర్వకంగా ప్రజాప్రతినిధుల యొక్క మెప్పు పొందేందుకు తన పరిధిలో ఉన్న బాధ్యతలను కూడా మరిచిపోయి కేసు పెట్టడం సమంజసం కాదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అధికారిగా ఉన్న తాసిల్దార్ నియమ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరి హక్కులను కాపాడవలసిన బాధ్యత ఉన్నప్పటికీ తాను పనిచేస్తున్నది ప్రజల కోసం కాదు అధికారుల మెప్పు కోసమని భావించి సదరు విలేకరిపై కేసు నమోదు చేయించడం సరైన పద్ధతి కాదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణమే స్పందించి ఆ విలేఖరి పై పెట్టిన కేసును విత్ డ్రా చేసుకోవడంతో పాటు అతనికి క్షమాపణ చెప్పాలని లేనట్లయితే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.



## పాపన్న గౌడ్ పోరాటం చిరస్మరణీయం

- పాపన్న ఆశయాలను కొనసాగించాలి
- మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్
- కరీంనగర్ కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్

**జమ్మికుంట ఆగస్టు 18 ప్రజాతీర్పు**

సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి పురస్కరించుకొని సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు పొన్నగంటి సంపత్, మాజీ మార్కెట్ చైర్మన్ పోలేని సత్యనారాయణ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో సామాజిక సమానత్వం అణగారిన వర్గాల హక్కుల కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగిస్తూ భావితరాలకు బంగారు బాటలు వేసిన విధంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని అభివర్ణించారు. పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జమ్మికుంట పట్టణంలోని శివాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గండి రంజిత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు కొలకాని రాజు, కనుమల్ల గణపతి, ఆకుల రాజేందర్ , కోరపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ,గండి యాదగిరి, మొగిలిపాక లక్ష్మణ్ గౌడ్, పల్లె శ్రీనివాస్ గౌడ్ ,బండా వెంకన్న, కారుపాకల వెంకన్న తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట అభివృద్ధి ప్రదాత దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలు

- 18వ వార్డు మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం

**నర్సంపేట టౌన్ ఆగస్టు 18 ప్రజా తీర్పు**



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారి పేరిట ఆలయ పూజారి చేత అర్చన చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆ భగవంతుడు వారికి శక్తిని ఇవ్వాలని.. నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు వెళ్లాలని ఉ అదేవిధంగా ఎమ్మెల్యే సహకారంతో 18వ వార్డు అభివృద్ధి పనులు తొందరగా పూర్తి కావాలని కోరుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో పి ఏ సి ఎస్ డైరెక్టర్ లక్కర్స్ రమేష్,18వ వార్డు అధ్యక్షులు బిట్ల మనోహర్,వార్డు ప్రధాన కార్యదర్శి దేవోజు హేమంత్,ఉపాధ్యక్షులు నకినబోయిన మహేష్,యూత్ అధ్యక్షులు బత్తుల కిట్టు, పొగాకు సాంబయ్య,పడాల పురుషోత్తం, నల్లెడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## టేకులపల్లిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య విస్తృత పర్యటన

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు...పాఠశాలలు తనిఖీ

**(పొనకంటిఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 18**

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం విస్తృతంగా పర్యటించారు. కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులు, విద్యాబోధన, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొక్కంపాడు, ఆర్సీ పేట, లచ్చగూడెం, శంభునిగూడెం, చింతోనిచిలక తదితర గ్రామాల్లో డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్డు పనులను ప్రారంభించారు. పలు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నారి కావ్యను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.




## పాలిటెక్నిక్ విద్యను శక్తి లో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనుకకు తీసుకోవాలి

పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 18**

టేకులపల్లి :మంగళవారం టేకులపల్లి మండల పిడిఎస్యు ముఖ్య కార్యకర్తల సమావేశం మండల మండల అధ్యక్షురాలు కా..రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పి డి ఎస్ యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ పాల్గొని మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్య విధానంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం శక్తి ( స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్ ) లో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేసే కుట్ర చేస్తుందని ఈ విధానాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పిడిఎస్యు ) తీవ్రంగా ఖండిస్తుంది అని, పాలిటెక్నిక్ చదువుకునే విద్యార్థులను శక్తిలో కలపడం అంటే వారి ఉన్నత విద్య అవకాశాలను పూర్తిగా తొలగించడమేనని, పాలిటెక్నిక్ విద్యకు ఇది ఒక రకమైన సమాధి అని కావున తక్షణమే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించి పాలిటెక్నిక్ విద్యను యధా విధంగా ఉన్నత విద్యా మండలి లోనే కొనసాగించాలని లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వరి, ఉష, దీపిక, లోకేష్ భర్గవ్ పాల్గొన్నారు.



## ఎస్సై కే. కళ్యాణిని కలిసిన టీ జేఎంయూ నాయకులు

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (ప్రజా తీర్పు)**

సుజాతనగర్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కే. కళ్యాణిని టీ జేఎంయూ జిల్లా నాయకులు కురుమల శంకర్, జక్కుల ఫాల్గుణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై కే. కళ్యాణికి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు చర్చించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖను ఆశ్రయించే పరిస్థితి ఉంటుందని, వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, శాంతియుత వాతావరణం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎస్సై కే. కళ్యాణిని కోరారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ సమస్యలను చట్టబద్ధంగా తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై కే. కళ్యాణి మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. టీ జేఎంయూ నాయకులు కురుమల శంకర్, జక్కుల ఫాల్గుణతో పాటు పోలీస్ శాఖకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు.

## వేములవాడలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 18**



వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ నుంచి శాత్రాజుపల్లి వెళ్లే మార్గంలో మధు రాజేందర్ బంక్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. టూ వీలర్‌ను కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## దొంతి మాధవరెడ్డి జన్మదిన సందర్భంగా బుధరావుపేటలో ఘనంగా రక్తదాన శిబిరం

**నర్సంపేట రూరల్, ఖానాపూర్, ఆగస్టు 18, ప్రజా తీర్పు ప్రతినిధి:**

నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డిజన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని, బుధరావుపేటలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది.రాష్ట్ర యువజన కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లాగౌడ్ ఆధ్వర్యంలో,నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి యువత పెద్ద ఎత్తున తరలివచ్చి, 50 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి 50కి పైగా యూనిట్లరక్తాన్నిఅందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నర్సంపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పల్స ప్రశాంత్ మండల అధ్యక్షులు హరిబాబు , బుధరావుపేట గ్రామ సర్పంచ్ పెసరు రాణిగోవర్ధన్ రెడ్డి , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగిడి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## పాఖాల నీటి విడుదలకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

- ఎమ్మెల్యే దొంతి విజ్ఞప్తితో పాఖాల నీటి విడుదలకు ఆదేశం

**నర్సంపేట టౌన్ ఆగస్టు 18 ప్రజా తీర్పు**



నర్సంపేట నియోజకవర్గంలోని పాఖాల సరస్సు ద్వారా ఆయకట్టు రైతులకు కాలువల ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని విడుదల చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నేడు వినతి పత్రం అందజేశారు. ఎలినినో ప్రభావంతో సాగునీటి వనరులలో నీటిని నిల్వ ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అయినప్పటికీ పాఖాల ఆయకట్టు రైతులు దాదాపు 9 వేల ఎకరాలకు పైగా ఇప్పటికే నాట్లు వేశారని , దీంతో నాట్లు ఎండిపోయే పరిస్థితి పొంచి ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం పాఖాల సరస్సులో ఉన్న నీటిని కాలువల ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని , పూర్తి వివరాలతో ఎమ్మెల్యే విన్నవించడం జరిగింది. స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కి వెంటనే నీటిని విడుదల చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి క్యాంపు కార్యాలయం, నర్సంపేట.

## మండల ప్రజావాణికి విశేష స్పందన

- 24 గంటల్లోనే విద్యుత్ సమస్య పరిష్కారం

**నర్సంపేట రూరల్, ఖానాపురం, ఆగస్టు, 18, ప్రజా తీర్పు ప్రతినిధి:**







మండల ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎంపీడీవో వనపర్తి అద్వైత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అధికారులకు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యా వనరుల కేంద్రం పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చాలని మండల విద్యాశాఖ అధికారులు వినతిని సమర్పించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ మంగమ్మ వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, 24 గంటల్లోపే సమస్యను పరిష్కరించేందుకు చర్యలుచేపట్టారు.ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి సమస్యనుపరిష్కరించడంతో స్థానికులు,అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు తక్షణ స్పందనతో చర్యలు తీసుకోవడం అభినందనీయమని వారుపేర్కొన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్‌కు చూపు మందగించింది.. ఉచితంగా ఆపరేషన్ చేయిస్తాం



**కోరుట్ల, ఆగస్టు 18 (ప్రజాతీర్పు)**

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు చూపు మందగించిందని, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్‌కు చూపించి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు.మంగళవారం జువ్వాడి భవన్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఎవరో తెలియదని ఎమ్మెల్యే సంజయ్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు.కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృష్ణారావు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ముత్యంపేట చక్కెర కర్మాగారం కోసం గతంలో కృష్ణారావు పాదయాత్రలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు.కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిలో స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు పాత్ర కీలకమని అన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు.జువ్వాడి కృష్ణారావు గురించి ఎమ్మెల్యే మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.ఇట్టి సమావేశంలో గడ్డం వెంకటేష్ గౌడ్, పన్నాల అంజిరెడ్డి, కొంతం రాజం, ఎంఏ నయీమ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి యువతకు అందించాలి

### ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

**హుస్నాబాద్ ఆగస్టు 18 రవీందర్ ప్రజా తీర్పు**



యువతకు నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా 3వ మహాసభ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ధర్మేంద్ర మాట్లాడుతూ...దేశ జనాభాలో యువత శాతం అధికంగా ఉన్నప్పటికీ వారికి నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి, అందుబాటు వైద్యం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన వార్షిక క్యాలెండర్ ప్రకటించాలని, పెండింగ్ నియామకాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రైవేట్, కాంట్రాక్ట్, గిగ్ రంగాల్లో పనిచేస్తున్న యువతకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని కోరారు.యువత, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని, ఫీజుల సమస్యలు, పరీక్షల నిర్వహణలో జాప్యం, పేపర్ లీకులు, పోటీ పరీక్షలకు ఖరీదైన కోచింగ్‌పై ఆధారపడే పరిస్థితికి ప్రభుత్వం స్వస్తి పలకాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, విద్యార్థి హాస్టళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. యువత హైదరాబాద్ వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితిని మార్చాలన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే యువతను గుర్తుచేసుకునే రాజకీయాలకు ముగింపు పలకాలని, యువత ప్రశ్నలకు సమాధానం చెప్పే పాలన రావాలని అన్నారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం హామీలు కాదని, అవి యువత హక్కులని తెలిపారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని, యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ధర్మేంద్ర పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కునుకుంట్ల శంకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెరిపోతుల జనార్దన్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు బోనగిరి రూపేష్, బిచ్చల శ్రీనివాస్, బోనగిరి శ్రవణ్, మహేష్, సుధాకర్, నరేష్, శ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాల యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి: ఇరిగేషన్ డీఈ భాస్కర్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (ప్రజా తీర్పు)**

రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు రైతులు వరి పంటకు బదులుగా ఇతర ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని ఇరిగేషన్ డీఈ భాస్కర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించి వరి సాగు, సాగునీటి లభ్యతపై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా డీఈ భాస్కర్ మాట్లాడుతూ సింగభూపాలెం చెరువు ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో చెరువులో నీటి సామర్థ్యం తక్కువగా ఉందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే అవకాశం ఉండదని తెలిపారు. వారబందీ విధానంలో వారం విడిచి వారం కుడి, ఎడమ కాలువల ద్వారా మాత్రమే నీటిని అందిస్తామని చెప్పారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. సాగునీరు అందక పంట నష్టం జరిగితే అందుకు నీటిపారుదల శాఖ అధికారులు బాధ్యత వహించరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఏఓ నర్మద, ఏఈఈ నిరోషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ పోతురాజు వెంకట్రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## బీసీ ఉద్యమ నాయకుడు డ్యాగల శ్రీనన్న ను కలిసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

**నర్సంపేట టౌన్ ఆగస్టు 18 ప్రజా తీర్పు**

నర్సంపేట బీసీ ఉద్యమ నాయకుడు,బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ను నర్సంపేట పట్టణంలోని తన నివాసంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి కురుమ, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శి నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, మొర్రి శ్రీనివాస్ కురుమ లు శ్రీనన్న ను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సంపేట బీసీ ల ముద్దుబిడ్డ, నర్సంపేట బీసీ ఉద్యమ నాయకుడు నర్సంపేట నియోజకవర్గంలో బీసీ వాదాన్ని గత 16 సంవత్సరాలుగా అనునిత్యం బీసీ ల హక్కుల కోసం పోరాడుతున్న బీసీ ఉద్యమ నాయకుడు డ్యాగల శ్రీనన్న అని అన్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగిన అఖిల భారత జాతీయ 11వ బీసీ మహాసభల కార్యక్రమంలో మా ముందే ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో శ్రీనన్న తలకు మరియు కాలుకు గాయాలు కావడం చాలా బాధాకరం అని బీసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా డ్యాగల శ్రీనన్న తొందరగా కోలుకుని వరంగల్ జిల్లా తో పాటు నర్సంపేట నియోజకవర్గంలో బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నామని అన్నారు.

## డిగ్రీ కళాశాలలో బేసిక్ కంప్యూటర్స్ పై సర్టిఫికెట్ కోర్స్

**హుస్నాబాద్ ఆగస్టు 18 రవీందర్ ప్రజా తీర్పు**



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా కంప్యూటర్ లో బేసిక్స్ పైన సర్టిఫికెట్ కోర్స్ మూడవ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కోర్సులో చేరుటకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ చదువుతున్న , పూర్తి అయిన విద్యార్థులు, అలాగే హుస్నాబాద్ పట్టణమునకు చెందిన ఇతర ఆసక్తి గల విద్యార్థులు అప్లై చేసుకోవచ్చని చెప్పారు. కళాశాలో గల ఆధునాతన కంప్యూటర్ ల్యాబ్ ను శిక్షణకు ఉపయోగిస్తామని తెలిపారు. ఈ శిక్షణకు గాను రూ. 400 లు ఫీజుగా, కోర్సు కాల పరిమితి రెండు నెలలు ఉంటుందన్నారు. కోర్సులో భాగంగా స్టడీ మెటీరియల్ మరియు కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ అందజేస్తామని తెలియజేశారు. ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. అప్లికేషన్, ఇతర వివరాలకు కోర్సు కన్వీనర్ డాక్టర్ వడ్లాల చంద్రమౌళి సెల్ 8897402310 లో కానీ ప్రత్యక్షంగా కాలేజీకి వచ్చి కానీ సంప్రదించగలరు. అప్లికేషన్ ఆఖరుతేది ఆగస్టు 25 అని తెలిపారు.

# భర్త చావు... అన్న-వదిన దోపిడీ!

- ఆస్థి కోసం కన్నేసిన ప్రభుత్వ టీచర్లు
- ఆస్థి పత్రాలు, 15 తులాల బంగారం లాక్కున్నారు
- బిడ్డ భవిష్యత్తు కోసం కనికరించండి.. అంటూ కలెక్టర్ ముందు వింతంతువు కన్నీరు
- ధర్మపురిలో వింత ఘటన

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )ఆగస్టు 18**



గుండెపోటుతో భర్తను కోల్పోయిన బాధ ఒకవైపు, మరోవైపు కట్టుకున్న వారే ఆస్తి కోసం గొంతు పిసుకుతున్నారనే భాధతో ఓ వింతంతువు మానసిక క్షోభను అనుభవిస్తు మానవత్వానికే మాయని మచ్చగా మిగిలిన ఈ ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. ఈ విషయమై జగిత్యాల జిల్లా కలెక్టర్ కు తన కూతురు చిన్మాయితో కలిసి వింతంతువు మానస న్యాయం చేయాలనీ వినతిపత్రం సమర్పించారు.

### మానస తెలిపిన వివరాల ప్రకారం...

ధర్మపురికి చెందిన దహగాం గిరీష్ 2025 ఏప్రిల్ 18న అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూశారు. భార్య మానస, 10 ఏళ్ల కూతురు చిన్మయి అనాథలయ్యారు. ఈ విషాదాన్ని కూడా లెక్క చేయకుండా గిరీష్ అన్న దహగాం గణేష్, వదిన కాసర్ల లావణ్య ఆస్తిపై కన్నేశారు. గిరీష్ పేరున ఉన్న పొలం పత్రాలు, ఇంటి పత్రాలతో పాటు సుమారు 15 తులాల బంగారాన్ని కూడా వారు బలవంతంగా తమ వద్ద ఉంచుకున్నారని మానస ఆరోపించారు. “అక్కా, భావ అని కాళ్లు పట్టుకుని బతిమాలాను. నా బిడ్డ చదువు కోసం, భవిష్యత్తు కోసం ఇవ్వంని వేడుకున్నాను. కానీ కనీసం కనికరం కూడా చూపలేదు” అంటూ మానస గుక్కపెట్టి ఏడ్చారు.ఇక్కడ అసలు ట్విస్ట్ ఏంటే... ఆరోపణలు ఎదుర్కొంటున్న గణేష్ ధర్మపురి లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తోటి కోడలు కాసర్ల లావణ్య జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పిల్లలకు విలువలు నేర్పాల్సిన వారే, ఓ వితంతువును, చిన్నారిని వేధిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

### కలెక్టర్‌కు పరుగు... న్యాయం కోసం పోరాటం

ఎక్కడా న్యాయం జరగకపోవడంతో విసిగిపోయిన మానస, కూతురు చిన్మయితో కలిసి నేరుగా జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. “మాకు న్యాయం చేయండి సార్. ఆస్తి పత్రాలు, బంగారం ఇప్పించండి” అంటూ వినతిపత్రం అందజేశారు.

### న్యాయ నిపుణులు ఏమంటున్నారు?

హిందూ వారసత్వ చట్టం 1956 ప్రకారం భర్త చనిపోతే ఆస్తిలో భార్య, పిల్లలదే మొదటి హక్కు అన్నారు. అన్నకు ఎలాంటి వాటా ఉండదని,అలాగే స్త్రీకి ఇచ్చిన బంగారం “స్త్రీధనం” కిందకు వస్తుందని,దాన్ని ఎవరూ అడ్డుకోలేరని, బాధితులు వెంటనే పోలీస్ కంప్లైంట్, రెవెన్యూ అధికారుల ద్వారా వారసత్వ సర్టిఫికేట్, డీ ఎల్ ఎస్ ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం తీసుకోవచ్చని చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి డీఈఓ కు ఫిర్యాదు చేయాలని వారు సూచిస్తున్నారు. భర్త లేని లోటును భర్తీ చేయకుండా, ఉన్న కొద్దిపాటి ఆస్తి కోసం సమాజానికి దిక్సూచిగా ఉండాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు స్పందించి తక్షణ న్యాయం చేయాలని మానస కోరుతున్నారు.

# సాగునీటి అవసరాలకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 18**



ఎల్ నినో నేపథ్యంలో రైతులు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరం గల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలంలో గల గొల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం నేపథ్యంలో రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ప్రాజెక్టులోని నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భీమారం మండల తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రతిపాదిత భూమి, మండలంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవనం పనులను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విలువైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల చదువు, పరీక్షల సన్నద్ధతపై సమీక్షించి, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే రీతిగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారితో మాట్లాడి వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై సూచనలు చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాలు, పంటల సాగుకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సదానందం, ఆర్.ఐ. రజిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు అందుబాటులోకి మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్.

- ప్రారంభించిన ఎస్పీ నరసింహ ఐపీఎస్.
- సాంకేతిక పద్ధతుల్లో కేసుల దర్యాప్తు.
- సంఘటన స్థలం నుండే వేగంగా ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ.
- నిందితులు తప్పించుకోకుండా త్వరగా గుర్తింపు.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 18**

సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు మరో అత్యాధునిక సాంకేతిక వాహనం (మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్) అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర పోలీసు శాఖ కేటాయించిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు పోలీసు అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, నేర పరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారం అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఈ మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ ద్వారా సంఘటనా స్థలం నుండే నేరుగా ఫోరెన్సిక్ ఆధారాలను వేగంగా సేకరించవచ్చని తెలిపారు. సాంకేతిక పద్ధతులను ఉపయోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం ద్వారా నిందితులను త్వరగా గుర్తించవచ్చని, వారు చట్టం నుండి తప్పించుకోకుండా కఠిన శిక్షలు పడేలా చేయవచ్చని ఎస్పీ గారు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, రాజశేఖర్, సాయిరాం మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## భరోసా కేంద్రాన్ని సందర్శించిన మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 18**

మంచిర్యాల జోన్ డీసీపీ ఎ.భాస్కర్ మంగళవారం సీసీసీ నస్పూర్‌లోని భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రంలో బాధితులకు అందుతున్న సేవలను పరిశీలించి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.భరోసా కేంద్రం పరిసరాలను పరిశీలించిన డీసీపీ, కేంద్రాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్,న్యాయ సహాయం,వైద్య సేవలు,మానసిక పరామర్శ, పునరావాసం తదితర సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవంగా స్వాగతించి,వారి సమస్యలను పూర్తిగా తెలుసుకోవాలని డీసీపీ సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని,అధికారులను ఆదేశించారు. మహిళలు,చిన్నారులు,ఇతర బాధితులకు అవసరమైన సేవలను సకాలంలో అందేలా చూడాలని,ప్రతి కేసును వేగంగా,నాణ్యతతో పరిష్కరించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్,షీ టీమ్ ఎస్ఐ హైమా, సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా CMC డివిజన్ BRS పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ జన్మదిన వేడుకలు

**షాపూర్ నగర్, ఆగస్టు 18,ప్రజా తీర్పు**

కుత్బుల్లాపూర్ జవీజ డివిజన్ బి ర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దీ=యా పార్టీ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద , మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పుప్పాల భాస్కర్ కి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ, పుప్పాల భాస్కర్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ కోసం అంకితభావంతో, నిరంతరం కష్టపడుతూ పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయనకు భగవంతుని ఆశీస్సులు, పార్టీ పెద్దల అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పుప్పాల భాస్కర్ కి శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలు సందడిగా, ఘనంగా జరిగాయి.




## దళిత బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 18 ప్రజా తీర్పు**

అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక, తొలి దళిత బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్ అన్నారు. వరంగల్ కలెక్టరెట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డా సత్య శారద అధ్యక్ష తన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, అడిషనల్ కలెక్టర్ లు గణేష్, సంధ్యారాణి,డీసీడీఓ పుష్పలత, జెడ్పి సిఈఓ రామ్ రెడ్డి తదిత రులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ గోల్కొండ కోటపై బహుజన జెండా ఎగరేసి, సామాజిక సమానత్వం కోసం వీరోచితంగా పాపన్న గౌడ్ పోరాడన్నారు.ఆ మహనీయుని ఆశయాలను ఎప్పటికీ ముందుకు తీసుకెళ్దామ న్నారు.బహుజనుల ముద్దు బిడ్డ గా గోల్కొండ కోటను పాలించిన రాజు గా కీర్తి కేక్కారని కొనియా డారు.గౌడుల కీర్తి ని చరిత్ర లో నిలిపిన సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని రమేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలోమోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు గొప్పగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిది మద్దెల సాంబయ్య గౌడ్, తోటకూరి రాందాస్ గౌడ్, పెరుమాండ్ల శ్రీ రామ్ గౌడ్,బొమ్మ గాని శ్యామ్ కుమార్ గౌడ్, రామ గోని సుధాకర్ గౌడ్, బత్తిని వెంక టేశ్వర్లు గౌడ్, వేముల రాజు గౌడ్ పాల్గొన్నారు.



## రోడ్డు విస్తీర్ణ పనులను పరిశీలించిన చైర్ పర్సన్ దావ స్వాతి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 18**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాసనసభ్యులు, గడ్డం వినోద్ వెంకట స్వామి ఆదేశాల మేరకు, బెల్లంపల్లి పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులలో బాగా సింగరేణి సంస్థకు సంబంధించిన విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులను పరిశీలించిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి.దావ స్వాతి-రమేష్ బాబు...ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, బెల్లంపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ పనులకు సహకరించేందుకు విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులు చేపట్టిన సింగరేణి యాజమాన్యానికి, మరియు ముఖ్యంగా మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాధాకృష్ణ కి ధన్యవాదాలు తెలిపారు... కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మత్తమారి రాయమల్లు సీనియర్ నాయకులు మునిమంద రమేష్, కంకటి శ్రీనివాస్, గాలి శ్రీనివాస్ పీక లక్ష్మణ్, రియాజ్, మున్సిపల్ సిబ్బంది మరియు సింగరేణి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బ్రహ్మకుమారిస్ నశాముక్త భారత్

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్ )ఆగస్టు 18**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రం లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఈశ్వరీయ బ్రహ్మకుమారిస్ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో నిర్వహించరు విద్యార్థులు వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సుచిత్ర మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఎవరైనా రాజయోగ విద్య ద్వారా మరియు ధ్యానంతో డ్రగ్స్ కు దూరంగా ఉండవచ్చని విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మద్యపానం డ్రగ్స్ కు దూరంగా ఉండాలని చదువు చదువు పైనే దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతో రమేష్, రత్నాకర్,స్టూడెంట్ కౌన్సిలర్ మార్కొండ రాంప్రసాద్ మరియు కళాశాల అధ్యాపకులు సంతోష్ లక్ష్మణ్ తిరుపతి శ్రీనివాస్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## 29వ డివిజన్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలు

**నర్సంపేట టౌన్ ఆగస్టు 18 ప్రజా తీర్పు**

నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి జన్మదిన సందర్భంగా పట్టణంలోని 29వ డివిజన్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేసి కార్యకర్తలు ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు ధ్యేయంగా నిరంతరం ప్రజల మధ్య ఉండే నాయకుడు అభివృద్ధి ప్రదాత శాసనసభ సభ్యులు దొంతి మాధవ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దండెం రతన్ కుమార్, డివిజన్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్, పట్టణ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, ఎన్ ఎస్ యు ఐ అద్యక్షులు కటారి ఉత్తంకుమార్, డివిజన్ యూత్ అధ్యక్షులు జీజుల కార్తీక్, మైనార్టీ అధ్యక్షులు ఎండి అఖిల్ పాషా, డివిజన్ ఉపాధ్యక్షులు వేముల బిక్షపతి, ఎన్ ఎస్ యు ఐ బిట్స్ కాలేజ్ అధ్యక్షులు జస్వంత్ రెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు గణేష్ ,భార్గవ్, శివ, ఫణీంద్ర,గౌరవ సలహాదారులు గొట్టేముక్కల ప్రభాకర్, జీజుల యాదగిరి, మద్దెల సాంబయ్య, పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## తహసిల్దార్ ను కలిసిన తెలంగాణ రాజాధికార పార్టీ నాయకులు

**జుక్కల్ /ఆగష్టు 18(ప్రజా తీర్పు ):**




కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ సంబంధిత ఇబ్బందులు మరియు ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు సంబంధిత మండల తహసీల్దార్ కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.రైతులకు మరియు స్థానికులకు సంబంధించి పెండింగ్లో ఉన్న పట్టాదార్ పాస్ బుక్ , భూ సర్వే మరియు రెవెన్యూ రికార్డుల సవరణలను త్వరగా పూర్తి చేయాలని.గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఆక్రమణల తొలగింపు మరియు ప్రజా సమస్యలపై రెవెన్యూ అధికారులు త్వరితగతిన స్పందించి.తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని.బాధితులకు తగిన న్యాయం చేయాలని, సమస్యలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించకపోతే ప్రజాక్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఈశ్వర్ తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020